J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 16 18.9.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కలిసుందాం..రా!



- మళ్ళీ ఒకటి కానున్న వై.యస్. కుటుంబం?
- జగన్‌కు దగ్గరయ్యేందుకు షర్మిల ప్రయత్నాలు
- పెద్దలు, శ్రేయోభిలాషుల ద్వారా మంతనాలు
- ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వని జగన్
- కలిస్తే.. 2029కి శుభసూచకమే అంటున్న వైసీపీ శ్రేణులు

"అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని" అన్న చందంగా ఎంత ప్రజాబలం, కావలసినంత ఆర్థిక స్థోమత ఉన్నా, భారీ స్థాయిలో అభిమానగణం ఉన్నా, వైఎస్ కుటుంబానికి అంతర్గత కలహాలే పెద్ద గుదిబండ అనడంలో సందేహం లేదు. మొదటి నుంచి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వివేకానందరెడ్డి కుటుంబాలు వైఎస్సార్ మావాడు అంటే మావాడు అన్న వాదులాటతో కలహాలకు కాలుదువ్వేవి. తర్వాత కాలంలో వివేకానందరెడ్డి ఆస్మికంగా మరణించడం, ఆ హత్యకు కారణం మీరంటే మీరంటూ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత, అవినాష్‌రెడ్డి ఆరోపణలకు దిగడం, కేసులు నమోదు కావడం, సరిగ్గా ఇదే సమయంలో ఆస్తుల గొడవ కారణంగా వైఎస్.జగన్, షర్మిల మధ్య విభేదాలు తలెత్తడం చివరికి వారిద్దరి మధ్య పలకరించుకునే పరిస్థితి కూడా లేకపోవడం తెలిసిందే.

ఇక 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 151 నుంచి 11 సీట్లకు పడిపోవడానికి కుటుంబ కలహాలు, విభేదాలు కూడా ఓ ప్రధాన కారణం అనడంలో సందేహం లేదు. కుటుంబంలో వచ్చిన బేధాభిప్రాయాలు వైఎస్ కుటుంబ పరువును బజారున పడేసి ప్రజల్లో పలుచన చేసిందన్న వాఖ్యానాలు కూడా వినిపించాయి. ఇక ఆ తర్వాత షర్మిల కాంగ్రెస్‌లో చేరి కూటమి ప్రభుత్వంపై కంటే జగన్‌పైనే తరచూ విమర్శలు చేయడం, జగన్‌లాంటి అన్న ఉంటే ఇక ఏ చెల్లెలికీ శత్రువులే అవసరం లేదని ఆరోపించడం కూడా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో

2లో

## మేయర్ కుర్చీ చుట్టూ తిరుగుతున్న.. నెల్లూరు రాజకీయం

3లో

Andhra Pradesh's First International School

FOSTREE
INTERNATIONAL SCHOOL

A 20-acre Functional Campus in Nellore




www.fostree.in is now live

Enquiry open for
2027–2028
academic year

CITY OFFICE
Fostree International School, 3rd Floor, Above Zudio, Grand Trunk Road, Near KVR Petrol Bunk, Dargamitta, Nellore 524003

Ms. Roshini Ambica Korrapati & Mr. Eswar Ambica Alapati *Directors*
Dr. Gayathri Loganathan *Head of School*

*From the House of Dr. Kishore's Ratnam*

enquire@fostree.in +91 92475 85223

# కలిసుందాం..రా!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్తుల గొడవ తారాస్థాయికి చేరి గతంలో ఇచ్చిన ఆస్తులను సైతం జగన్ వెనక్కి తీసుకునేందుకు న్యాయ స్థానాలను ఆశ్రయించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారింది. ఇక అటు కొడుకు ఇటు కూతురు ఇద్దరికీ నచ్చజెప్పలేక, ఒక్కటిగా కలిపి ఉంచలేక వైఎస్సార్ సతీమణి విజయమ్మ సైతం అల్లాడిపోయిన సందర్భాలు అనేకం చూశాం. అయితే తాజాగా వైఎస్సార్ ఫ్యామిలీ మళ్లీ ఒకటి కాబోతోందని జగన్, షర్మిల మళ్లీ కలిసి సాగేలా కుటుంబ రాయ బారాలు జోరందుకున్నాయన్న చర్చ ఇప్పుడు ఆంధ్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

## లోపలికెళ్లి చూస్తే..
## చర్చ చాంతాడంత

దివంగత మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు శ్రమించి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. తద్వారా కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-1, యూపీఏ-2 సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఇక తన సంక్షేమ పథకాల ద్వారా కోట్లాదిమంది తెలుగు ప్రజల అభిమాన నాయకుడ య్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, ఇందిరమ్మ ఇళ్లు, జలయజ్ఞం తదితర పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టినవే అయినా వాటి క్రెడిట్ మొత్తం వైఎస్సార్‌దే, అవి వైఎస్సార్ పథకాలే అన్నంతగా జనం ఆ మహానేతకు నీరాజనాలు పలికారు. అందుకే 2004 ఎన్నికలతో పాటూ 2009 ఎన్నికలలో ఒంటి చేత్తో వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌ను గెలిపించి సోనియా కుటుంబానికి కానుకగా ఇచ్చారు. అయితే 2009 ఎన్నికల తర్వాత వైఎస్సార్ ఆకస్మికంగా మరణించడం, వైఎస్ జగన్ అనూహ్యంగా ఫుల్‌టైం పొలిటిక్స్ చేయాల్సిన పరిస్థితి రావడం, ఓదార్పు యాత్రతో రోజుల తరబడి ప్రజల్లో తిరగడం, నాటి కాంగ్రెస్ హై కమాండ్ ఓదార్పు యాత్రకు బ్రేకులు వేయడం, దాన్ని వ్యతిరేకిస్తూ సోనియా గాంధీని ఎదిరించి మరీ వైఎస్ జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత కడప ఉప ఎన్నికల్లో జగన్ దాదాపు 5లక్షలపై చిలుకు ఓట్లతో గెలుపొందడం, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ కనుమరుగై, కొత్తరూపంతో వైఎస్సార్ కాం గ్రెస్‌గా మారుతుందన్న అంచనాలు జోరందుకోవడం తెలిసిందే. వీటన్నింటిపై దృష్టి సారించిన సోనియా నేతృత్వంలోని కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర విభజన ద్వారా తెలంగాణలోనైనా లబ్ధిపొందాలని ఆశిం చడం, రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రాన్ని విడగొట్టడం, ఆంధ్రలో కాంగ్రెస్‌పార్టీ అడ్రస్ లేకుండా పోవడం, సరిగ్గా ఇదే సమయంలో వైఎస్ జగన్‌పై అక్రమాస్తుల కేసులు నమోదై 16 నెలల పాటు జైలు జీవితం అనుభవిం చడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు తన అన్న జగన్ వదిలిన బాణం అంటూ చెల్లి షర్మిల సుదీర్ఘ పాదయాత్ర చేయడం, తర్వాత ఎన్నికల్లో జగన్‌తో పాటు ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి 2014 ఎన్నికల్లో 60 పై చిలుకు స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించడంలో కీలకపాత్ర పోషిం చడం తెలిసిందే. ఆ తర్వాత కూడా అన్న జగన్ వెంటే ఉంటూ షర్మిల చేదోడువాదోడుగా పార్టీని ముందుకు నడిపించడంలో తనవంతు సాయం చేశారు. ఇక 2019 ఎన్నికల్లో అత్యంత కీలకపాత్ర పోషించిన "బైబై బాబు" నినాదం షర్మిల ఇచ్చిందే కావడం గమనార్హం.

## గెలుపు తర్వాత మలుపు
## కుటుంబంలో కుదుపు!

2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించి 151 సీట్లతో వైఎస్ జగన్ సీఎం కావడం, తనదైన శైలి పాలన, సంక్షేమ పథకాలతో ఆయన దూసుకెళ్లడం తెలిసిందే. అయితే తర్వాత షర్మిలకు అటు పార్టీలో కానీ, ఇటు ప్రభుత్వంలో కానీ ఎలాంటి పదవులు ఇవ్వకుండా దూరం పెట్టేశారనే అపవాదు రావడం, ఆస్తుల పంపకాల్లో తీవ్ర విభేదాలు ఏర్పడడం, వైఎస్ విజయమ్మను పార్టీ గౌరవ అధ్యక్షురాలి హోదా నుంచి తొలగించడంతో వైఎస్ఆర్ కుటుంబంలో రాజుకున్న రచ్చ కార్చిచ్చు తరహాలో రగిలి జగన్, షర్మిల ఎడ మొఖం పెడముఖం అన్నట్లుగా పరిస్థితి దిగజారింది. ఇక 2019 ఎన్నికల ముందుకు చోటు చేసుకున్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కూడా వైఎస్ఆర్ కుటుంబంలో విభేదాలకు బీజం వేసిందనే చెప్పాలి. ఈ క్రమంలోనే కొత్త పార్టీ పెట్టి కొన్నాళ్లు తెలంగాణలో పాదయాత్ర పేరుతో హల్‌చల్ చేయడం, తర్వాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలి హోదాలో షర్మిల విస్తృతంగా పర్యటిం చడం, ఆ పర్యటనల్లో వైఎస్ జగన్‌పై విమర్శల వర్షం కురిపించడం, వాటిని ఆధారంగా చేసుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్‌మీడియా కార్యకర్తలు షర్మిలను కించపరుస్తూ ఆరోపణలకు దిగడం, పోస్టులు పెట్ట డంతో వైఎస్సార్ కుటుంబం పూర్తిగా చీలిపోయింది. జగన్, షర్మిల నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరుకోవడం ఈవిషయంపై ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరిగి 2024 ఎన్నికల్లో పార్టీకి డ్యామేజ్ కలిగించడం కూడా శరవేగంగా జరిగిపోయాయి.

## 2029 నాటికి మళ్లీ కలిసికట్టుగా!

చివరికి వైఎస్ జగన్, షర్మిల ఒకరినొకరు ఎదురుగా కూడా చూసుకోలేని పరిస్థితి రావడంతో వైఎస్సార్ కుటుంబంలోని పెద్దలు, శ్రేయోభిలాషులు షర్మిలకు గీతోపదేశం చేశారని విశ్వసనీయంగా తెలి సింది. కొత్త పార్టీతో తెలంగాణలో ఏం సాధించావ్? కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలి హోదాలో ఆంధ్రాలో ఏం చేయగలిగావ్..? అన్నకు నష్టం కలిగించడం తప్పా..! అని వారు తీవ్ర ఆగ్రహంతో పాటూ హితబోధ చేసి నట్లు వినికిడి. అందుకే విభేదాలను పక్కనపెట్టి, ఆస్తుల విషయంలో సామరస్య పూర్వక ఒప్పందంతో ముందు కెళ్లి మళ్లీ వైఎస్సార్ కుటుంబమంతా ఒక్కటే అనేలా ప్రజలకు, రాజకీయ పక్షాలకు స్పష్టమైన మెసేజ్ ఇవ్వా లని ప్రస్తుతం షర్మిల తలపోస్తున్నట్లు సమాచారం. తాజాగా షర్మిల కుమారైకు వివాహం నిశ్చయం కావడం, ఈ అంశం కోసమైనా వైఎస్ జగన్‌తో విభేదాలను తొలగించుకుని కలిసి సాగాలని ఆమె యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జరిగిన చర్చలో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్, వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహిత లైన కొందరు కాంగ్రెస్ కురువృద్ధులు సైతం జగన్, షర్మిల విభేదాలను వీడి ఒక్కటిగా సాగితే మంచిదేకదా అని సూచించినట్లు వార్తలొస్తున్నాయి. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుని వైఎస్సార్ కుటుంబ సభ్యుల ద్వారా జగన్‌ను ప్రసన్నం చేసుకునేందుకు షర్మిల ఈమేరకు వర్తమానం పంపించారని తెలిసింది. ఇందులో విభేదాలను పక్కనపెట్టి వైఎస్సార్ కుటుంబ ప్రతిష్టను పునరుద్ధరించేందుకు తాను రెండడుగులు తగ్గేందుకు సైతం సిద్ధమని ఆమె తెలియజేసినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై వైఎస్ జగన్ ఇంకా ఎటూ తేల్చలేదనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా వైఎస్ భారతి ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. అదే రాజీ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవు తున్నాయి. ఏదేమైనా 2027 రెండో అర్ధభాగం నుంచి రెండోసారి పాదయాత్ర చేయాలని భావిస్తున్న వైఎస్ జగన్‌కు ఇది శుభసూచకమే అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక అన్నీ అనుకున్నట్లు జరిగి జగన్, షర్మిల మళ్లీ ఒకటై రాజకీయం చేస్తే 2029 ఎన్నికల నాటికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అది అతిపెద్ద బూస్ట్ నిస్తుందనడంలో సందేహం లేదు. మరి అన్నా చెల్లి భవిష్యత్‌లో ఏ విధంగా ముందుకెళ్తారో కాలమే నిర్ణయించనుంది.!

# వినాయకచవితి రోజునే విషాదాలు

## పలు ఘటనల్లో అయిదుగురు మృత్యువాత

వినాయకచవితి పర్వదినం కొన్ని కుటుంబాల్లో విషాదాలకి దారితీసింది. అల్లూరు మండలం ఇందుపూరులో పాతకక్షలు చెలరేగి వినాయకచవితి రోజున వినాయక మండపం వద్ద వివాదాలతో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం..ఇందుపూరు దళితవాడ నివాసి పల్లి వెంకటేశ్వర్లు (53), బి.మస్తాన్‌ల మధ్య గతంలో స్థలం విషయంలో గొడవలు ఉండేవి. వీరు వినాయకచవితి నాడు వినాయకుని విగ్రహం వద్ద ఎదురుపడి మాటామాటా పెరిగి, పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లుకు గాయలై ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కావలి రూరల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్‌ఘాతానికి.. హోంగార్డు బలి



వినాయకచవితి నాడు ఆత్మకూరులో విషాదం చోటుచేసుకుంది. అక్కడి పోలీస్‌క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న హోంగార్డు ఎం.ప్రసాద్(42) ప్రమాదవ శాత్తూ విద్యుత్‌షాక్‌కి గురై అక్కడికక్కడే మృతిచెరందాడు. ఆయన మృతితో, స్వగ్రామమైన మర్రిపాడు మండలం కృష్ణాపురంలో విషాదం అలముకుంది. హోంగార్డు మరణవార్త తెలిసిన వెంటనే ఆత్మకూరు డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సీఐ జి.గంగాధర్, ఎస్ఐ జంపానికుమార్‌లు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి తరలివచ్చి పరిశీలించారు. హోంగార్డు మృతికి వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ఆయన కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలిపారు.

### గుంపర్లపాడులో పిడుగుపాటుకు పశువుల కాపరి కన్నుమూత



ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడులో వినాయకచవితి రోజున పశువులను మేపుకుని, పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తున్న నరసారెడ్డి(25) సమీపంలోనే ఉరుములు మెరుపులతో పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ఆ ప్రాంతంలో ఉన్న పశువుల కాపర్లు అది గమనించి వెంటనే నరసారెడ్డిని ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మృతిచెందాడు. దీంతో ఆయన తల్లితండ్రులు గోడుగోడుమంటున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



వినాయకచవితి రోజున తమ కార్యాలయంలో పూజలు చేసేందుకు కారులో బయలుదేరిన ఇద్దరు స్నేహితులు ఒంగోలుకు వెళ్తూ, మార్గమధ్యంలో గౌరవరం జాతీయరహదారిపై ప్రమాదానికి గుర య్యారు. తోటపల్లిగూడూరు మండలం సౌత్ ఆములూరుకు చెందిన కలవకొల్లు శశికుమార్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, కారు నడుపుతున్న ఆయన స్నేహితుడు మహేష్‌ప్రీతమ్‌కు తీవ్రగాయాలు తగిలాయి. ఈ సమాచారం అందుకున్న కావలి రూరల్ డీఎస్పీ వీవీ రమణకుమార్, సీఐ రాజేశ్వర రావు, పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లి శశికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొని..యువకుడు దుర్మరణం

వినాయకచవితి పండుగరోజున నెల్లూరులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు ఎన్టీఆర్‌నగర్‌కి చెందిన సాయి(26) దుర్మరణం పాలయ్యాడు. తన స్నేహితుడు కరిముల్లాతో కలిసి బైక్‌పై గొలగమూడి క్రాస్‌రోడ్డు నుంచి ఎన్టీఆర్‌నగర్‌కి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సాయి బైక్‌ని నడుపుతూ ముందు వెళ్తున్న లారీని ప్రమాదవశాత్తూ ఢీకొట్టడంతో స్నేహితులిద్దరికీ తీవ్రగాయాలు తగిలాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయి మృతిచెందాడు. దీంతో ఆయన భార్య, కుమారుడు పెద్దపెట్టున రోదించారు.

# 'వికసిత్ భారత్' క్విజ్‌లో..యువత పాల్గొనాలి

- **జిల్లా యువజన అధికారి నరసింహకుమార్**

'వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జిల్లాలోని యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని జిల్లా యువజన అధికారి ఏ.వి.నరసింహకుమార్ పిలుపు నిచ్చారు. యువతలో నాయకత్వ లక్షణా లను, దేశం పట్ల అవగాహనను పెంపొం దించే ఉద్దేశంతో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. జిల్లాలోని 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువత మై భారత్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వివరా లను నమోదు చేసుకుని ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. క్విజ్‌లో మొత్తం 20 ప్రశ్నలు ఉంటాయని, వాటికి సమాధానాలు ఇవ్వడానికి 10 నిమిషాల సమయం కేటాయించబడుతుందని తెలిపారు. క్విజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, పాల్గొన్నవారికి సర్టి ఫికెట్ ఆన్‌లైన్‌లో వస్తుందని తెలిపారు.

# విద్యార్థి సంఘాల నిరసన

మండల కేంద్రమైన కోటలో ఉన్న డా. అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను ఎత్తివేయడం తగదని, దానిని వెంటనే కొనసాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 16న నెల్లూరులో వీఆర్‌సీ సెంటర్‌లో విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ మాట్లాడుతూ, ఆ గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల మూతతో వారు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. గురుకుల పాఠశాలను కొనసాగించకుంటే ఉద్యమం తప్పదన్నారు. ఎస్ఎఫ్ జిల్లా నాయకులు నరేంద్ర, శివవర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా సహకార సేవలు

## వరిగొండలో కొత్త శాఖ ప్రారంభించిన సోమిరెడ్డి, మెట్టుకూరు



సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని వరిగొండలో కేంద్ర సహకార బ్యాంకు శాఖ ఇటీవల ప్రారంభమైంది. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి ఈ శాఖకి ప్రారంభోత్సవం చేశారు. పేదూరు, తోటపల్లిగూడూరు, కృష్ణపట్నం పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులు ఇకపై ఇక్కడే బ్యాంకింగ్ సేవలు అందుకోవచ్చని వారు తెలిపారు. రైతులతో పాటు సామాన్య ప్రజలు కూడా ఇక్కడ సేవలు పొందవచ్చని, అన్ని రకాల రుణాలతో పాటు లాకర్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ధనుంజయరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు డీసీసీబీ పరిధిలో సుమారు 3 వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో 62 లక్షల మంది రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. జాతీయ బ్యాంకులతో సమానంగా డీసీసీబీ ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయని తెలిపారు. నాయకులు బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెలవెలబోయిన చివరి జడ్పీ సమావేశం

- **అధికారులు రానందుకు నిరసనగా బైఠాయింపు**



జడ్పీటీసీలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

జిల్లా ప్రజాపరిషత్ పాలకవర్గం గడువు త్వరలోనే ముగియనున్న నేపథ్యంలో ఈనెల 17న నెల్లూరు జడ్పీ హాల్‌లో జరిగిన జడ్పీ సమావేశం నామమాత్రంగానే జరిగింది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే అధికారులెవరూ రాకపోవడంతో పర్వతరెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్యంలో చీకటిరోజు అని అభివర్ణించారు. ఇది జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం అని తెలిసినా, అధికారులు ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులు ఎవరినీ హాజరు.. కాకుండా చేయడం ఛైర్‌పర్సన్‌గా ఉన్న మహిళను అవమానించడమేనంటూ ఆయన మండిపడ్డారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ ఇలాంటి పరిణామాలను చూడలేదన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులు, జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈవో ఎవరూ హాజరు కాకపోవడంతో.. సభలో ఎన్నడూ లేని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజా సమస్యలపై. చర్చించేవారు లేక సభ వెలవెలబోయింది. అనంతరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ..నుంచి బయటకు వచ్చి జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో.. అధికారుల తీరును నిరసిస్తూ..ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, జడ్పీటీసిలతో కలిసి.. బైటాయించి నిరసన తెలియజేశారు.

# శ్రీసిటీని సందర్శించిన.. సతీష్ మండువ



సతీష్‌ని సత్కరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర అమెరికా పెట్టుబడుల ప్రధాన అనుసంధానకర్త సతీష్ మండువ ఈనెల 17న శ్రీసిటీని సందర్శించారు. రాష్ట్రానికి ఉత్తర అమెరికా పెట్టుబడులను ఆకర్షించేందుకు నియమితులైన ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధంతో పాటు ఉత్తర అమెరికా వ్యాపార వర్గాల్లో విస్తృత పరిచయాలు, అనుభవం ఉన్నాయి. ఈ సందర్భంగా సతీష్ మండువకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అవకాశాలను ఉత్తర అమెరికా పెట్టుబడిదారులకు పరిచయం చేయడంలో ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో భాగంగా శ్రీసిటీలోనూ ఉత్తర అమెరికా సంస్థల భాగస్వామ్యం పెంచేందుకు, శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాలను పరిచయం చేసేందుకు తనతో కలసి పనిచేసేందుకు సంకల్పించారన్నారు. అనంతరం వారు స్థానిక డైకిన్ పరిశ్రమను సందర్శించారు.

# మేయర్ కుర్చీ చుట్టూ తిరుగుతున్న..
# నెల్లూరు రాజకీయం!

***నెల్లూరుకి కాబోయే కొత్త మేయర్ ఎవరు..? ఏ పార్టీ నుండి ఎవరు పోటీ చేయబోతున్నారు..? ఈసారి రిజర్వేషన్ ఎలా వుండబోతోంది..? ప్రస్తుతం నెల్లూరు రాజకీయాలలో సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్నలు, ఆసక్తికరంగా సాగుతున్న చర్చ ఇదే.***



కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



కోటంరెడ్డి వైష్ణవి



పొంగూరు షరణి



రూప్‌కుమార్‌యాదవ్



ఏసీ సుబ్బారెడ్డి



డా. రాధామాధవి

ఇప్పటికే వున్న 54 డివిజన్లు కొత్తగా ఏర్పడిన 18 డివిజన్లతో కలిపి 72కి పెరిగాయి. ఇటు కూటమి అటు వైసీపీ రెండు ప్రధాన పార్టీల తరపున కార్పొరేటర్లుగా పోటీ చేసేవారి సంఖ్య 146 (మేయర్ అభ్యర్థులతో సహా) మంది అయినప్పటికీ అన్ని పార్టీలలో కలిపి ఆశావహుల సంఖ్య 400కి పైగానే ఉన్నట్లు ఆయా పార్టీ వర్గాల సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల తరువాత మళ్ళీ మేయర్ అభ్యర్థి కోసం నేరుగా ఎన్నిక జరగబోతుండడంతో ఈసారి కార్పొరేషన్ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతని సంతరించుకోబోతున్నాయి. మొత్తం నెల్లూరు నగరంలో 36, నెల్లూరు రూరల్‌లో 36 డివిజన్లుగా నగరాన్ని విభజించారు. ఈ తరుణంలో ప్రధాన పార్టీల మేయర్ అభ్యర్థి ఎవరు అన్నది అత్యంత ఆసక్తి కరంగా మారింది. అయితే, అభ్యర్థి ఎవరు అన్న ప్రశ్నకి తెరపడాలంటే అంతకుముందే రిజర్వేషన్ అంశానికి ముగింపు పలకాలి. కార్పొరేషన్ ఏర్పడిన కొత్తలో తొలి మేయర్‌గా ఓసీ మహిళకి అవకాశం దక్కింది. ఆ తరువాత బీసీ కోటాలో మైనారిటీలు చేజిక్కించుకున్నారు. ఇక తాజాగా ఎస్టీ జనరల్ కోటాలో ముందుగా పొట్లూరి స్రవంతి, ఆ తరువాత నేటివరకూ దేవరకొండ సుజాత మేయర్‌గా పదవి దక్కించుకున్నారు. గత చరిత్రని ఒకసారి గమనిస్తే ఐదేళ్లు పూర్తిగా ఒకే మేయర్‌గా కొనసాగింది మాత్రం మైనారిటీ నాయకుడు అబ్దుల్ అజీజ్ మాత్రమే. మిగతా రెండు పర్యాయాలలో చోటు చేసుకున్న అనేక కీలక పరిణామాలతో మేయర్ అభర్థులు మారుతూవచ్చారు. ప్రతి ఐదేళ్లకి ఒకసారి రిజర్వేషన్లు మారుతున్న క్రమంలో ఈసారి మేయర్ స్థానం ఏ సామాజికవర్గాన్ని వరించబోతోందో అన్నది అత్యంత ఆసక్తికరంగా మారింది. రాజకీయ వర్గాల్లో సాగుతున్న చర్చని బట్టి గమనిస్తే ఈసారి ఓసీ లేదా బీసీ జనరల్ కానీ, లేదంటే ఓసీ లేదా బీసీ మహిళ కానీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

## వరుసలో వారసులు!

ఓసీ జనరల్ లేదా ఓసీ మహిళకి అవకాశం వస్తే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి లేదా శ్రీధర్‌రెడ్డి కుమార్తె సాయి వైష్ణవి అయినా బరిలో ఉంటారన్న వార్తలు వస్తున్నాయి. అయితే, తమ నాయకుడు శ్రీధర్‌రెడ్డి లక్ష్యం మంత్రి పదవి అని, కాబట్టి పార్టీ అధిష్టానం ఎవరిని నిర్ణయించినా వారి గెలుపు కోసం తమ నాయకుడు కృషి చేస్తాడని శ్రీధర్‌రెడ్డి అభిమాన శ్రేణులు బల్లగుద్ది మరీ చెప్తున్నారు. ఇలాంటి తరుణంలో నారాయణ కుమార్తె షరణి పొంగూరు బరిలో వుండే అవకాశాలు కూడా లేకపోలేదన్న చర్చ కూడా రాజకీయవర్గాలలో జోరుగా సాగుతోంది. ఇదే సమయంలో వైసీపీ నుండి ఆనం వివేకానంద రెడ్డి కుమారుడు ఏసీ సుబ్బారెడ్డిని బరిలో దింపాలని ఆ పార్టీ వర్గాలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు వార్త. అలాగే ఒకవేళ మహిళకి అవకాశం ఇవ్వాల్సివస్తే ఇటీవల వైసీపీ సోషల్ మీడియాలో డైనమిక్ మహిళగా ప్రాచుర్యం పొందిన డాక్టర్ రాధామాధవిని వైసీపీ శ్రేణులు రంగంలో దించుతారని ప్రచారం జరుగుతోంది. అయితే, ఓసీ లేదా బీసీ జనరల్ అయితే తనకి అవకాశం కల్పించవలసినదిగా ప్రస్తుత డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్ గట్టిగా పట్టు పడుతున్నట్లు.. ఆయనకి పార్టీ పెద్దల ఆశీస్సులు కూడా ఉన్నట్లు పుకార్లు జోరుగా షికార్లు కొడుతున్నాయి.

ఏదిఏమైనప్పటికీ ఈసారి నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు కూటమి నాయకులకి పెద్ద సవాల్‌గా మారనున్నాయి. గతంలో మొత్తం 54స్థానాలు వైసీపీ గెలుచుకోవడం, అప్పుడు మేయర్‌కి డైరెక్ట్ ఎన్నిక లేకపోవడం ఆ పార్టీకి కలిసొచ్చిన అంశం. అయితే, ఈసారి డివిజన్ల సంఖ్య 72కి పెరగడం, మేయర్ కోసం నేరుగా ఎన్నిక జరగడం వంటి అంశాలతో కూటమి నాయకులకి నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు కత్తిమీద సామే. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలవడంతో ప్రస్తుతం నెల్లూరు రాజకీయం మొత్తం మేయర్ కుర్చీ చుట్టూ తిరుగుతోంది!

# జీజీహెచ్‌లో.. 'సత్య' పుట్టినరోజు వేడుకలు



రోగులకి పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న డాక్టర్ మాధవి, శ్రీనివాసులు తదితరులు

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మొగరాల సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, కమిటీ ఛైర్మెన్ శ్రీనివాసులు తదితరులతో కలసి వార్డులో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సత్యకుమార్‌యాదవ్ ఏబీవీపీలో విద్యార్థి సంఘం నాయకునిగా తన ప్రస్థానం ప్రారంభించి, ఇప్పుడు బీజేపీలో కీలకపాత్ర పోషిస్తున్నారని వారు ఈ సందర్భంగా కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఉన్న ప్పుడు, ఆయనకు సత్య ఓఎస్‌డీగా ఉంటూ సేవలందించారని తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మల్లికార్జున, రాజేష్‌లతో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

లాయర్
సెప్టెంబర్ 18, 2026

# యుద్ధాలు కాదు.. 'ప్రపంచశాంతి' కావాలి!

ప్రపంచం సాంకేతిక యుగంలోకి దూసుకుపోతున్నా, ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతున్నామని గర్వంగా చెప్పుకుంటున్నా, వాస్తవంలోకి వస్తే.. మనం ఇంకా అథ:పాతాళంలోకే వెళ్తున్నామా అనిపిస్తోంది. ప్రపంచానికి ఇప్పుడున్న అతిపెద్ద సవాళ్ళలో ప్రధానమైనవి శాంతి-భద్రతలే! నిజం చెప్పాలంటే ఏ దేశానికి గుండెమీద చేయివేసుకుని హాయిగా నిద్రపోయే పరిస్థితులు ఇప్పుడు కనిపించడం లేదు. ఏ దేశం..ఏ దేశం మీద హటాత్తుగా యుద్ధం ప్రకటిస్తుందో, ఎక్కడినుంచి ఎక్కడికి బాంబులు, విసురుతుందో చెప్పలేం. ఉగ్రవాదాలు, మారణహోమాలు, మతాల విద్వేషాలు, కులాల జాతుల కొట్లాటలు..ఒకటా రెండా ప్రపంచమంతా ఎక్కడ చూసినా ఇలాంటి దౌష్ట్యాలదే రాజ్యమైపోతుంటే, మరోవైపు యుద్ధాలు మానవాళిని మరింత బెంబేలెత్తిస్తున్నాయి. ప్రపంచంలో ఎక్కడో ఒకచోట యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతో మంది బలహీనులు, ప్రజలు అత్యంత దారుణంగా వాటికి బలైపోతూనే ఉన్నారు. బలం ఉన్నవాడు బలహీనుడిని చంపుకు తిన్న ఆటవిక రాజ్యం మళ్ళీ గుర్తుకువస్తోంది. ఇది యుద్ధాల కాలం కాదని, శాంతి సామరస్యాలతో జీవించాలని, మానవాళి విశ్వశాంతితో పరిఢవిల్లాలని కోరుకుంటున్న పరమశాంతి దేశం భారత్‌పై కూడా కొన్ని దేశాలకి కంటగింపుగానే ఉంది. పొరుగు దేశాలుగా ఉన్నా, ఎన్నిసార్లు దెబ్బలుతిన్నా వాటి బుద్ధి మాత్రం మారడం లేదు. వాళ్ళ జోలికి మనం వెళ్ళకున్నా, ఏదో ఒక విధంగా మనదేశంలో మారణహోమాలు సృష్టించాలని చూస్తూనే ఉన్నాయి. చీటికీమాటికీ కయ్యానికి దిగే వాటి నైజం ఎప్పటికి మారుతుందో, ఆ దేవుడికే తెలియాలి. దేశమేదైతేనేం.. యుద్ధం ఎక్కడైనా ఒకటే. ఎవరో ఒకరి ప్రాణాలు తీయడమే లక్ష్యం. యుద్ధాలు వద్దు.. విశ్వశాంతే ముద్దు అనీ, 'ప్రపంచానికి కావాల్సింది అణ్వస్త్రాలు కాదు..అన్న వస్త్రాలనీ' శాంతికాముకులు అనాదిగా పదేపదే చెప్తున్నా, యుద్ధకాంక్షతో ఉండే దేశాలు ఖాతరు చేయడం లేదు. నేటి ఆధునిక కాలంలో యుద్ధాల తీరు..ఆయుధాలు అన్నీ మారిపోయి.. శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న దేశాలే యుద్ధాల్లో నిలుస్తున్నాయి.. గెలుస్తున్నాయి. తమ మాట వినని దేశాలపై దండెత్తే ఆటవిక లక్షణం కూడా వారి సహజలక్షణంగా తయారవుతోంది. ఎక్కడో మారుమూల కూర్చుని..సముద్రాల కవతల లక్షల మైళ్ళ దూరంలో ఉన్న దేశాల మీద కూడా బాంబులు వేసేస్తూ వికృతానందం పొందడం యుద్ధకాంక్షతో ఉన్నవారికి మామూలైపోయింది. దానివల్ల ఎన్ని ప్రాణాలు పోతున్నాయో, ఎన్ని వేలమంది లేదా లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే లెక్కలు వారికక్కర లేదు. యుద్ధాలకి ఎవరి కారణం వారిది. అయితే, యుద్ధాలు జరగకుండా, ఒకరినొకరు చంపుకోకుండా, శాంతియుత వాతావరణంలో కూర్చుని చర్చించుకుంటే ఎంతటి జటిలమైన సమస్యలైనా సమసిపోతాయని విజ్ఞులు-అనుభవజ్ఞులు చెప్తున్నా పట్టించుకునే వారేరీ?.. మనిషన్నాక మానవత్వంతో, శాంతియుతంగా..ధర్మబద్ధంగా జీవించాలనే భారత్ చెప్పే శాంతి మాటలని అందరూ పెద్దమనసుతో అవగాహన చేసుకోవాలి. ఏ దేశంలో యుద్ధం జరిగినా అది అన్ని దేశాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతున్న కాలమిది. అయినా.. సామాన్య ప్రజలని, అమాయకపు జనాన్ని కూడా బతకనివ్వని యుద్ధాల వల్ల చివరికి సాధించేదేం ఉంటుంది?.. మనిషి దుష్టబుద్ధిలోంచి పొడుచుకొచ్చే యుద్ధాల ఆలోచనలకి ఇకనైనా ముగింపు పలకాలి. ప్రపంచంలో ఆకలి, పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, తదితర సమస్యలతో అల్లాడే దేశాలు ఎన్నో ఉన్నాయి. వాటికి స్నేహహస్తం అందించి ఆదరించాల్సిన తరుణంలో, అలాంటి కష్టాల నుంచి మానవాళిని రక్షించే విషయం పట్టించుకోకుండా యుద్ధాలకోసం.. ఆధిపత్యం కోసం వెంపర్లాడడాన్ని ఏమనాలి? అందుకే, విభేదాల కంటే చర్చలకి, ద్వేషం కంటే మానవత్వానికి, హింస కంటే శాంతికి ప్రాధాన్యత ఇవ్వాలని, యుద్ధాల కంటే విశ్వశాంతే ముఖ్యమని, శాంతియుత ప్రపంచాన్ని అందరూ కలసి సాకారం చేసుకోవాలని ఐక్యరాజ్య సమితి సెప్టెంబరు 21వ తేదీని ప్రపంచశాంతి దినోత్సవంగా ప్రకటించింది. ప్రతి ఒక్కరూ ప్రపంచశాంతిని కోరుకుంటూ శాంతియుతంగా, పరస్పర గౌరవంతో మనుగడ సాగించాలన్నదే దాని లక్ష్యం. యుద్ధాలకు దారితీసే పరిస్థితులని గమనించి వాటిని ఉపశమింపజేసేందుకు కృషిచేయాలన్నది సారాంశం. యుద్ధాలని వ్యతిరేకిస్తూ.. శాంతివైపే అందరూ సాగిపోవాలి. అయితే, శాంతి అంటే యుద్ధం లేకుండా ఉండడం ఒక్కటే కాదు, ప్రతిఒక్కరికీ న్యాయం-సమానత్వం-భద్రత, హక్కుల పరిరక్షణ అన్నీ కూడా సక్రమంగా ఉండాలి. యుద్ధాల్లో గెలుపోటములుండవు. చావులు మాత్రమే ఉంటాయి. ఆ మృత్యు రాకాసిని వెలివేసి, మానవాళి అంతా..శాంతి సామరస్యాలతో జీవిస్తే.. అదే విశ్వశాంతి అవుతుంది. విశ్వానికి అదే సరికొత్త కాంతి కూడా అవుతుంది.. ఆ రోజును ప్రపంచమంతా కలసి సాకారం చేసుకోవాలి!...

(సెప్టెంబరు 21..ప్రపంచ శాంతి దినోత్సవం)

# బ్రిక్స్ తీర్మానాలు.. మారుతున్న ప్రపంచానికి సంకేతాలు!

న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భారత్‌లతో కూడిన 11 సభ్య దేశాలు ప్రాతినిధ్యం వహించాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. బ్రెజిల్ తరఫున విదేశాంగ మంత్రి మౌరో వియెరా ప్రాతినిధ్యం వహించారు.

"బలమైన వ్యవస్థ, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత" అనే ఇతివృత్తంతో జరిగిన సదస్సులో శాంతి, బహుళపక్ష విధానం, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

భద్రతా మండలి ప్రస్తుత నిర్మాణాన్ని సంస్కరించాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. ఏకపక్ష ఆంక్షలు, వాణిజ్య ఆంక్షలు, రక్షణాత్మక సుంకాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇంధన, ఆహార భద్రతతో పాటు డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ఆరోగ్యం, వ్యవసాయం, వాణిజ్యం వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచాలని నిర్ణయించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, పాలస్తీనా సమస్య, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపైనా దృష్టి సారించాయి. విశ్లేషణాత్మకంగా చూస్తే, బ్రిక్స్ ఇక కేవలం ఆర్థిక సహకార వేదికగా మిగలకుండా గ్లోబల్ సౌత్ దేశాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు ఒక ముఖ్యమైన వేదికగా ఎదుగుతోంది. అయితే సభ్య దేశాల మధ్య భౌగోళిక రాజకీయ విభేదాలు ఉన్న నేపథ్యంలో ప్రతి అంశంపై ఏకాభి ప్రాయం సాధించడం పెద్ద సవాలే. అందువల్ల న్యూఢిల్లీ సదస్సులో చేసిన తీర్మానాలు ఎంతవరకు ఆచరణలోకి వస్తాయన్నది భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

*యం. చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ**

# మోత మోగించారు!

ఈసారి నగరంలో వినాయక చవితి ఉత్సవాలు గత ఏడాదికంటే ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మాగుంట లేఅవుట్ నాలుగు దిక్కులా స్పీకర్ల ద్వారా సౌండు మోత మోగించారు. బొమ్మలు పెట్టిన దగ్గర నుండి సుమారు అర కిలోమీటర్ వరకు స్పీకర్లు బిగించారు. మొత్తానికి ప్రతీ ఇంటికీ అన్ని దిక్కులనుండి శబ్దాలు మారు మోగుతుండడంతో చెవుల తుప్పు వదిలింది. డీజేలు, భారీ స్థాయిలో సౌండ్లు పెట్టడానికి లేదన్న పోలీసువారి నిబంధనలకన్నా, రాజకీయ నాయకుల పలుకుబడే నెగ్గిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఏడాది కొక్కసారే కదా.. భరించాలి తప్పదు. గణపతి బప్పా మోరియా!

*వీసి చౌదరి,* **మాగుంట లే అవుట్.**

# ఇది.. భారత్ చతురత

మనసులో మాట 115

ప్రపంచ భౌగోళిక రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్న తరుణంలో, ఇటీవల భారత్ ఆతిథ్యమిచ్చిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఏకపక్ష టారిఫ్‌ల దెబ్బకు విలవిల్లాడుతున్న వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు, మరోవైపు పశ్చిమాసియాలో అగ్నిగుండంలా మారుతున్న ఉద్రిక్తతల నడుమ జరిగిన ఈ సదస్సుపై ప్రపంచ దేశాలన్నీ తీవ్ర ఉత్కంఠతో కన్నేసి ఉంచాయి.

ఈ సదస్సును విజయవంతంగా నడిపించిన తీరు దౌత్యపరంగా భారత్ సాధించిన ఒక గొప్ప మైలురాయిగా చెప్పుకోవాలి. ముఖ్యంగా, 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లో 'డీ-డాలరైజేషన్' (డాలర్ ఆధిపత్యాన్ని కూల్చడం) గురించిన ఎలాంటి తీవ్ర ప్రకటనలకు తావులేకుండా, కేవలం ఆయా దేశాల కరెన్సీలలో వాణిజ్య లావాదేవీలు చేపట్టాలనే తీర్మానానికి మాత్రమే పరిమితం కావడం భారత్ చతురతకు నిదర్శనం.

మే నెలలో జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం ఎలాంటి ఏకాభిప్రాయం లేకుండానే అర్ధంతరంగా ముగిసింది. అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని, టెహ్రాన్ చేపట్టిన ప్రతీకార చర్యలను ఏ పదాలతో ఖండించాలనే దానిపై కూటమిలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. అలాంటిది, పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా తలపడుతున్న ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల అధినేతలు ఒకే టేబుల్ వద్ద ముఖాముఖి కూర్చునేలా చేయడంలో భారత్ తన అద్భుతమైన 'సమన్వయ శక్తిని' నిరూపించుకుంది. న్యూఢిల్లీ డిక్లరేషన్ ను ఏకగ్రీవంగా ఆమోదింప చేయడంలో భారత్ విజయం సాధించింది. డిక్లరేషన్‌లో ఏ ఒక్క దేశం పేరునూ (అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్) నేరుగా ఎత్తిచూపకుండా, కేవలం "గరిష్ట సంయమనం పాటించాలని" కోరడం ద్వారా భారత్ ఒక పరిణతి చెందిన దౌత్య విధానాన్ని అవలంబించింది. ఇరాన్ అధినేత పెజెష్కియన్ స్వయంగా భారత రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలవడం, ఇరాన్ పట్ల భారత్ తన విదేశాంగ విధానాన్ని ఎంత నిశ్శబ్దంగా, సమర్థంగా అవలంబిస్తోందో చెప్పడానికి నిదర్శనం.

చైనా, రష్యాలు ఉన్న బ్రిక్స్ కూటమిని పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా ఒక సైద్ధాంతిక యుద్ధ భూమిగా మార్చాలని కొన్ని వర్గాలు కోరుకున్నాయి. కానీ భారత్ ఈ సదస్సును అటువంటి అపరిపక్వ ఆలోచనలకు దూరంగా విజయవంతం చేసింది. ఈ సదస్సును గమనిస్తే, భారత్ అనుసరించిన విదేశాంగ విధానంలో ఒక స్పష్టమైన పరిపక్వత కనిపిస్తుంది. ఒకపక్క పాశ్చాత్య దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, మరోపక్క బ్రిక్స్ వేదికగా అమెరికా ఆధిపత్య ధోరణులను, ఏకపక్ష ఆర్థిక ఆంక్షలను సున్నితంగానే గట్టిగా ఎండగట్టడంలో భారత్ నాయకత్వం సఫలమైంది. అమెరికా మనకు అత్యున్నత వాణిజ్య భాగస్వామిగా ఉన్న తరుణంలో (2025 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 239.6 బిలియన్ డాలర్లు), భారత్ ఏ శిబిరంలోనూ గుడ్డిగా కొట్టుకుపోవడానికి సిద్ధంగా లేదు. తాను "పాశ్చాత్య వ్యతిరేకం" కాదని, కేవలం "పాశ్చాత్యేతర" దేశమని భారత్ మరోసారి నిరూపించింది. మిత్రదేశాలు కొన్నిసార్లు తప్పుగా ప్రవర్తించినప్పుడు, వ్యూహాత్మకంగా, విభేదాలున్న దేశాలను కూడా దగ్గరగా ఉంచుకుని ఒత్తిడి తెచ్చేందుకు బ్రిక్స్ ఒక చక్కటి వేదికగా ఉపయోగపడుతుందనే వాస్తవాన్ని ఢిల్లీ సదస్సు రుజువు చేసింది.

బ్రిక్స్ అంటేనే చైనా, రష్యా వంటి అమెరికా వ్యతిరేక దేశాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న వేదిక. చైనాతో మనకు సరిహద్దు వివాదాలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం అందరితో కలిసి పనిచేయాలనే భారత్ వ్యూహం ఎంతో పరిపక్వతతో కూడుకున్నదది. ఎందుకంటే, బ్రిక్స్‌లో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి భారత్ లాంటి పెద్ద ప్రజాస్వామ్య దేశం చురుకుగా ఉండడం అత్యంత కీలకం. భారత్ వ్యూహాత్మకంగా లేకపోతే, బ్రిక్స్ పూర్తిగా చైనా కనుసన్నల్లో నడిచే ప్రమాదం ఉండేది. ఈ నేపథ్యంలో దిల్లీ సదస్సు భారత్‌ను ఒక బలమైన నిర్ణయాధికారిగా నిలబెట్టింది.

ఉగ్రవాదం విషయంలో బ్రిక్స్ దేశాలు మరోసారి స్పష్టమైన వైఖరిని ప్రదర్శించాయి. గతంలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఈ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందించడం, సురక్షిత ప్రాంతాలు కల్పించడం వంటివాటిపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని పునరుద్ఘాటించడం భారత్ సాధించిన పెద్ద దౌత్య విజయంగా భావించవచ్చు. కేవలం రాజకీయాలు, ఆర్థికాంశాలే కాకుండా డిజిటల్ వ్యవసాయం, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు పునరుత్పాదక వ్యవసాయ విధానాలు, విపత్తు నిర్వహణ కోసం 'బ్రిక్స్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ కాన్స్టెలెంటేషన్' ఒప్పందాలు భవిష్యత్ అవసరాలకు బాటలు వేశాయి. ఐరాస భద్రతా మండలిలో కాలం చెల్లిన విధానాలు మాని, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, బహుళక్షేత్ర భద్రతను పునరుద్ధరించాలని సదస్సు బలంగా కోరింది.

సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ లేవనెత్తిన అంశాలు నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న వాస్తవాలను కళ్లకు కట్టాయి. కృత్రిమ మేధస్సు, సైబర్ స్పేస్ అత్యవసర ఖనిజాలను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఆయుధాలుగా మారుస్తున్న తీరు ప్రపంచ అభివృద్ధికి పెనుముప్పుగా మారుతోందని ఆయన హెచ్చరించారు. చైనా తన వంతుగా ఏఐ గ్లోబల్ గవర్నెన్స్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగింది. మొత్తంగా చూస్తే, ప్రపంచం నలువైపులా విచ్ఛిన్నకర శక్తులు చెలరేగుతున్న ఈ తరుణంలో... అంతర్జాతీయ వ్యవస్థను కూల్చివేయడం కాక, దానిని సంస్కరించుకుంటూ ముందుకు వెళ్లడమే సరైన మార్గమని ఈ బ్రిక్స్ సదస్సు చాటిచెప్పింది. మహాశక్తుల మధ్య నలిగిపోకుండా, తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ భారత్ నడిపించిన ఈ దౌత్యం విజయం సాధించింది. భారత్ నాయకత్వ పటిమను ప్రపంచానికి మరోమారు చాటిచెప్పింది.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# అభివృద్ధిలో.. 'నెల్లూరు నంబర్ వన్' కావాలి

## ○ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆకాంక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వేజెండ్ల

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో, లక్ష్యసాధన దిశగా మరింత చురుగ్గా పని చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 16న ఆయన కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 8వ కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై చర్చించిన అంశాలు, జిల్లాలో శాంతి భద్రతలు, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉత్తమ పని తీరు కనబరిచిన విద్యుత్ శాఖ అధికారులను, పీఎం సూర్యఘర్ పథకం కింద 25 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు అందించి రాష్ట్రంలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపిన అధికారులను అభినందించారు.

### వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

వైద్యులు అంకితభావంతో పనిచేయాలని, మానవతాదృక్పథంతో..బాధ్యతతో రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఈనెల 16న నెల్లూరులోని జీజీహెచ్ (ప్రభుత్వ సర్వజన వైద్యశాల) అభివృద్ధిపై ఆయన వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమర్జెన్సీ ట్రామా కేర్ యూనిట్ మరియు మెడికల్ ఐసీయూ అభివృద్ధికి అవసరమైన పరికరాలు సమకూర్చడం, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయడం వంటి అంశాలపై సూపరింటెండెంట్ డా. మాధవికి దిశానిర్దేశం చేశారు.

# 23.75 కోట్లతో.. జీజీహెచ్‌లో 'క్రిటికల్ కేర్'

## ○ అత్యవసర వైద్యసేవలకు మరో కొత్త సదుపాయం



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (పెద్దాసుపత్రి)లో రూ.23.75 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభమైంది. అత్యవసర వైద్యసేవలకు ఇదెంతో ఉపయోగకరం కూడా. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాకుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తదితరులు వర్చువల్‌గా ఈ క్రిటికల్ కేర్ సదుపాయాలను ప్రారంభించారు. నెల్లూరులో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వాటి ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ, జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రావడం నెల్లూరు జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. రోడ్డు ప్రమాదాలు, ముఖ్యంగా అర్ధరాత్రి వేళ చోటుచేసుకునే ప్రమాదాలు, అత్యవసర కాన్పులు, చిన్న పిల్లలకు తక్షణ వైద్య చికిత్స, గుండెపోటు, ఇతర తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులకు అత్యవసర, సమగ్ర క్రిటికల్ కేర్ వైద్య సేవలు అందించేందుకు ఇదెంతో దోహదపడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని, అందుకు అవసరమైన ఆధునిక వైద్య మౌలిక వసతులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వైద్య రంగంలో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.మాధవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 40 ఏళ్లు దాటాయా?.. అయితే గుండె పరీక్షలు చేయించుకోండి!



పోస్టర్లని ఆవిష్కరిస్తున్న అపోలో వైద్యులు

నలభై ఏళ్లు దాటాయా?..అయితే వెంటనే గుండె పరీక్షలు చేయించుకోండి అని సూచిస్తున్నారు నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యులు. అంతేకాదు, కేవలం 3,999 రూపాయలకే గుండె పరీక్షలు చేయించుకునేందుకు వెసులుబాటు కలిగిస్తూ ప్రత్యేక ప్యాకేజీని కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈ ఏడాది 14వతేదీ వరకు 2026 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆ వివరాలను వారు ఇటీవల విలేకర్లకు తెలియజేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, గుండె వైద్య నిపుణులు షర్మిలీ, నాగభూషణం, జైగణేశ్ మరియు అనస్థీసియా డాక్టర్ మధు మాట్లాడుతూ, సమాజంలో నానాటికీ మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రజలు గుండె వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తతో ఉండాలని వారు చెప్తున్నారు. ఒక్కోసారి నొప్పి వచ్చినప్పుడు గ్యాస్టిక్ సమస్యగా భావిస్తుంటారని, అయితే ఆ నొప్పి నిజంగా గుండెకు సంబంధించినదా, కాదా అనే విషయాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, హాస్పిటల్ యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సేవచేయడం అభినందనీయం

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి




దివ్యాంగులకి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలంలో దివ్యాంగులకు సేవ చేసేందుకు పలు సంస్థలు ముందుకురావడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అందుకోసం ప్రత్యేకించి ఎనేబుల్ ఇండియా, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, 'సపోర్ట్' సంస్థల ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన 82 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, రివాల్వింగ్ చైర్స్, కుషన్ చైర్స్, వీల్ చైర్స్ తదితర పరికరాల పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, చెన్నైలో పుట్టి బెంగళూరులో స్థిరపడి, ఏపీతో పాటు 14 రాష్ట్రాల్లో దివ్యాంగులకు సేవలు అందిస్తున్న ఎనేబుల్ ఇండియా చైర్‌పర్సన్ శాంతి రాఘవన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అంగవైకల్యం కలిగిన వారికి జీవనోపాధి కల్పించడంతో పాటు కనీస అవసరాలు తీర్చేందుకు ఈ సంస్థలు పనిచేస్తున్నాయని, వెంకటాచలం, మనుబోలు, టీపీ గూడూరు, ముత్తుకూరు మండలాల్లోని దివ్యాంగులను సమీకరించి స్వర్ణభారత్ ట్రస్టులోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయీమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ అందిస్తున్నారని వివరించారు.

# అమరజీవి త్యాగం..అజరామరం

## శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణలో వేమిరెడ్డి దంపతులు



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని వేమిరెడ్డి దంపతులు కొనియాడారు. కోవూరు పట్టణంలోని గాంధీ పార్కులో ఏర్పాటుచేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 13న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. అమరజీవి విగ్రహం నెలకొల్పడం ద్వారా, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన ఒక మహనీయుడి త్యాగాన్ని మన మధ్య శాశ్వతంగా నిలబెడుతున్నామని అన్నారు. తన సొంత నిధులతో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గాదిరాజు అశోక్‌ని ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రాబోయే తరాలకు పొట్టి శ్రీరాములు గొప్పతనం తెలియాలనే ఉద్దేశంతో ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని విగ్రహస్థాపకులను కొనియాడారు.

# మానవ మనగడకు..భాషే జీవనాడి!

## ఆచార్య మాడభూషి సంపత్ కుమార్



భాషే మానవ మనుగడకు జీవనాడి అని, భాషా వినియోగం సమాజానికి సాంస్కృతిక, ఆర్థికపరమైన పునాదులను బలపరుస్తుందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ చెప్పారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఈనెల 15న వెంకటాచలం మండలం సరస్వతినగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సభకి అధ్యక్షత వహించి మాట్లాడుతూ భాషా ఉద్యమాలతో పాటు, ప్రతి ఉద్యమానికి తన సాహిత్యంతో ఊపిరి పోసిన మహనీయులు ప్రజాకవి కాళోజి నారాయణరావు అని కొనియాడారు. మాతృభాషను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, భాషాపరంగా, సంస్కృతి పరంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, ప్రభుత్వాలపై ఉందన్నారు. మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజా షామిలి, కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బూర్ల వెంకటేశ్వర్లు, ప్రాచీన విశ్వవిద్యాలయం విద్యాత్మక సిబ్బంది బడిగె ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తీర్ణతలు పెంచాలి

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచాలని, ఉత్తీర్ణతలను పెంపొందించాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి చెప్పారు. ఈనెల 16న నెల్లూరులోని డీఇఓ కార్యాలయంలో ఆయన నెల్లూరు డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరయ్యే విధంగా చూడాలని, అవసరమైతే వారి తల్లి తండ్రులతో మాట్లాడాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, మంచి బోధనతో వారు మంచి ఉత్తీర్ణతలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో డీఇఓ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసీ డి. వెంకటసుబ్బయ్య, ఏఎంఓ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమరసత ఫౌండేషన్ నాయకుల వినతి

జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలకు న్యాయపరమైన హక్కులు కల్పించాలని సమరసత సేవా ఫౌండేషన్ నాయకులు కోట సునీల్‌కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కి ఈనెల 15న వినతిపత్రం సమర్పించారు. నాయకులు ఊరుమిండి వెంగళ్ రెడ్డి, కె.ఆనంద్, పి.రమణయ్య, డి.రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంజనీర్స్ డే.. వేడుకలు

నెల్లరులోని విద్యుత్‌భవన్‌లో ఈనెల 15న భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఎస్ఇ పి.సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభాపాటవాలను, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అల్తాఫ్, పరంధామయ్య, లక్ష్మీనారాయణ, భాను నాయక్, లక్ష్మీప్రసన్న, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకుడు శేషారెడ్డి, ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ రవిచంద్ర, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## రాష్ట్రం బాగా అభివృద్ధి చెందాలి

- గణనాథుని ప్రార్థించిన మంత్రి నారాయణ



విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడి ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి చెందాలని విఘ్నేశ్వరుడిని కోరుకున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గం 13వ డివిజన్ మిట్టపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మంత్రి నారాయణ ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అడిషనల్ కమిషనర్ హిమబిందు, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు కాయల తిరుపతి, ఊటుకూరు చంద్ర, గణేశ్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో గణపతి పూజ



వినాయకచవితి రోజున నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు జెన్ని రవణయ్య, మామిడాల మధు, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, సురేంద్రబాబు, దోర్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ చికిత్సపై రెడ్‌క్రాస్‌లో అవగాహన



ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12న నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి -నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాని ప్రాధాన్యతను వైద్యనిపుణులు తెలియజెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను ఎలా కాపాడవచ్చో వివరించారు. తొలుత, రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రి డ్యూనాంట్ చిత్రపటానికి అడ్‌హాక్ కమిటీ సభ్యులు పూలమాలా వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 145 మంది సభ్యులు పాల్గొన్నారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు చమర్తి జనార్ధన్‌రాజు, యాలమూరి రంగయ్యనాయుడు, డా. దయాకర్, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో.. మంత్రి ఆనం పూజలు



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు నగరంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత నెల్లూరులోని తన నివాసం వద్ద తనయుడు ఆనం శుభకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆనం కుటుంబం అనాదిగా ఆనవాయితీగా ప్రతిఏటా పాల్గొనే కాపువీధి వినాయక మహోత్సవాల్లో, తదుపరి మండపాల వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మంత్రి సందర్శించి పూజలు చేశారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నగర ప్రముఖులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కిమ్స్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కేశవ చౌదరి, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నాదస్వర కచ్చేరీ



నెల్లూరు ఇరుగాలమ్మ గుడి సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న కంచి కామకోటి పీఠం ఆస్థాన నాదస్వర విద్వాంసులైన బ్రహ్మశ్రీ టి.కె.ఆర్. అయ్యప్పన్, టి.కె.ఆర్. మీనాక్షి సుందరం ఆధ్వర్యంలో నిర్వహించిన నాదస్వర కచేరీ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తమ అద్భుతమైన సంగీత ప్రతిభతో ఆలపించిన మంగళవాద్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. కచేరీని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం మంత్రి ఆనం నాదస్వర కళాకారులను సత్కరించి, వారి సంగీత సేవలను ప్రశంసించారు.

## పాఠశాల యాజమాన్య కమిటీలకి..ఎన్నికలు 29న

పాఠశాల యాజమాన్య కమిటీలకి ఈనెల 29న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 18న పాఠశాలల్లో ఓటర్ల జాబితాలు ప్రదర్శించాలని, వాటిపై 25న అభ్యంతరాలేమైనా ఉంటే స్వీకరించి, పరిష్కరించి తుది జాబితాలు ప్రకటించాలని సమగ్ర శిక్ష రాష్ట్రప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాసరావు ఈనెల 16న ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయని, మధ్యాహ్నం 1.30 గంటలకి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను ఎన్నుకుంటారని, 2 గంటలకు ప్రమాణస్వీకారం, ఆ తర్వాత నూతన కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారని ఆయన వివరించారు.

## గణేశునికి.. షరిణి పూజలు

నెల్లూరు నగరంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె షరిణి పలు ప్రాంతాల్లో పర్యటించి గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి

ప్రఖ్యాత గాయకురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి కార్యక్రమం ఈనెల 16న నెల్లూరులోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాలలో జరిగింది. తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునికుమార్, సుబ్బులక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె గానప్రతిభని కొనియాడారు. విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల సీఈఓలకి.. ఆన్‌లైన్ శిక్షణ

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలకి ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్- విజయవాడ, సహకార శిక్షణ కేంద్రం-ప్రొద్దుటూరు వారు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సహకారశాఖ అధికారి బి. గురప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంఘం వారు గిడ్డంగులను రైతులకు అందుబాటులోకి తేవాలని, డ్రై యార్డ్‌లు నిర్మించాలని సూచించామన్నారు. గ్రామాలలో రైతులు పంటను నిల్వ చేసుకునేందుకు అవసరమైన చోట గిడ్డంగులు నిర్మించాలని, డీసీసీ బ్యాంకు నెల్లూరుజిల్లా ప్రాజెక్టు డెవలప్‌మెంట్ మేనేజర్ మహేషా వ్యాపార అభివృద్ధి ప్రణాళికలను, సహకార శిక్షణ కేంద్రం-ప్రొద్దుటూరు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు ఈ శిక్షణా కార్యక్రమాల ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు.

## 22న..మహారుద్ర పారాయణం

నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ నిర్మించిన ఆదిశంకర ధ్యాన మందిరంలో ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటల నుండి 44 మంది వేద పండితులు నాలుగు బృందాలుగా అహోరాత్ర మహారుద్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నెల్లూరు నగరంలో తొలిసారిగా 24 గంటలపాటు ఈ రుద్ర పారాయణం నిర్వహించనున్నామని, లోకకళ్యాణార్థం, వర్షాభావ స్థితి నివారణార్థం ఈ దైవకార్యం నిర్వహిస్తున్నామని ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, కమిటీ అధ్యక్షులు గుండావంతుల రామసుబ్రహ్మణ్యం శర్మ, చక్రాల వెంకటలక్ష్మీ నరసింహులు ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు.






## విచిత్ర విన్యాసాల..ఒలింపియన్ సర్కస్



నెల్లూరులోని కూరగాయల మార్కెట్ వద్దనున్న వైఎంసిఏ గ్రౌండ్స్‌లో ఇటీవల ఒళ్లు గగుర్పొడిచే అద్భుత విన్యాసాలతో, పిల్లలు ఆనందించే బఫూన్‌ల కామెడీ షోలతో ఒలింపియన్ సర్కస్ ప్రారంభమైంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీల సహకారంతో ఈ సర్కస్‌ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు సర్కస్ ఉంటుందని, సోమవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు సర్కస్ నిర్వహిస్తామని, టిక్కెట్లు 'బుక్ మై షో'లో బుక్ చేసుకోవచ్చని, లేదా సర్కస్ జరిగే ప్రదేశంలోని కౌంటర్ వద్ద టిక్కెట్లు తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలు సకుటుంబ సమేతంగా వచ్చి, సర్కస్‌ని ఆదరించి, దేశవిదేశీ సర్కస్ కళాకారులను ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పాత బడులకి.. కొత్త అందాలు

## విపిఆర్, డిఎస్ఆర్ చొరవతో రూపొందిన పాఠశాలలని ప్రారంభించిన మంత్రి లోకేష్



**కూ**టమి ప్రభుత్వం రాకతో..నెల్లూరు నగరంలో ప్రభుత్వ బడులకు కొత్తవెలుగులు వస్తున్నాయి. రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ నేతృత్వంలో, వీపీఆర్, డిఎస్ఆర్ వంటి దాతల దాతృత్వంతో ఈ బడులు బాగుపడుతున్నాయి. కొన్ని నెలల క్రితమే నెల్లూరులోని చరిత్రాత్మకమైన విఆర్ స్కూలుకు ఆధునిక వసతులు రావడంతో, ఎంతోమంది బాలబాలికలకు అది విద్యారామం కావడం తెలిసిందే. తాజాగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విపిఆర్ ఫౌండేషన్ సారథ్యంలో, డిఎస్ఆర్ (దేవిరెడ్డి శారత చారిటబుల్ ట్రస్ట్) ట్రస్ట్ ఆధ్వర్యంలో కోట్లాదిరూపాయల వ్యయంతో ఆయా పాఠశాలలు కొత్త కళను సంతరించుకున్నాయి. దాతల కృషితో ఆధునిక వసతులతో పునర్నిర్మితాలైన మూలాపేటలోని డీఎస్ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాలని, స్టోన్‌హౌస్‌పేటలో ఆర్ఎస్ఆర్ పాఠశాలని రాష్ట్ర విద్యామంత్రి నారా లోకేష్ ఈనెల 16న ప్రారంభించడం విశేషం.

### 8.3 కోట్లతో ఆర్ఎస్ఆర్

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషితో, విపిఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో..దాదాపు 8.3 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ పాఠశాలకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ ఈనెల 16న ప్రారంభోత్సవం చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తొలుత మంత్రి లోకేష్‌కు నెల్లూరు ఎంపీ, వీపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం లోకేష్ పాఠశాల మొత్తం కలియతిరిగి తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. రెండు అంతస్థుల్లో భారీ నిర్మాణంతో 43 తరగతి గదులను ఈ పాఠశాలలో అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు, అధునాతన బెంచీలను ఏర్పాటుచేశారు. పాఠ్య పుస్తకాలకే విద్యను పరిమితం చేయకుండా ప్రయోగాత్మక, సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్, లాంగ్వేజ్‌రూమ్‌లు తదితర ప్రత్యేక వసతులను కల్పించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ మోడ్రన్ టాయిలెట్లను ఏర్పాటుచేశారు. ఎకరా స్థలంలో ప్లేగ్రౌండ్ ఏర్పాటుచేయడంతో పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు సిద్ధం చేశారు. అదనంగా కిడ్స్ ప్లేఏరియా, సెన్సరీ పార్క్, అవుట్‌డోర్ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలను కల్పించారు. సుమారు 21వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంగణంలో పాఠశాల విద్యకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం, కళలు, క్రీడలు, డిజిటల్ విద్య తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక మంత్రి పి. నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్ఎస్ఆర్ పాఠశాలని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్, పక్కన మంత్రి నారాయణ, ఎంపీ విపిఆర్, నారాయణ కుమార్తె షరణి

### 13.41 కోట్లతో డీఎస్ఆర్

నెల్లూరు మూలాపేటలో అత్యంత ఆధునిక వసతులతో పునర్ నిర్మించిన డీఎస్ఆర్ (దేవిరెడ్డి శారద) ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంత్రి నారా లోకేష్ ఈనెల 16న ప్రారంభోత్సవం గావించారు. దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ వారు రూ. 13.41 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పాఠశాలను అభివృద్ధి చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, శ్రీమతి దేవిరెడ్డి శారద విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మంత్రి పి.నారాయణ, ఆయన తనయ షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ. 13.40కోట్ల రూపాయలను వెచ్చించి ఈ పాఠశాలను పునర్ నిర్మించారు. రెండంతస్థుల్లో సుమారు 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 24 తరగతి గదులు నిర్మించారు. విద్యార్థులకు ఆధునిక బోధన అందించేందుకు 15 ఎల్ఈడీ స్క్రీన్‌లు, 300 బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యా అవసరాలకు అనుగుణంగా పాఠశాలలో ప్రత్యేక ల్యాబొరేటరీలను ఏర్పాటు చేశారు. ఆర్ట్, మ్యూజిక్, సిక్, స్టోర్, లాంగ్వేజ్ రూమ్‌లు, లైబ్రరీ వంటి ప్రత్యేక సదుపాయాలను కల్పించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆధునిక టాయిలెట్లను ఏర్పాటు చేశారు. బాస్కెట్‌బాల్, పికిల్ బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో కోర్టులు, ఓపెన్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, కిడ్స్ ప్లే ఏరియా, సెన్సరీ పార్క్, అవుట్‌డోర్ జిమ్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌లు కూడా ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, అధికారులతో లోకేష్ సమీక్షించారు. విద్యార్థుల హాజరు తక్కువగా వుండడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు.



చిన్నారులతో ఆసక్తిగా ముచ్చటిస్తున్న మంత్రి నారా లోకేష్

# శ్రీసిటీని సందర్శించిన.. ఆర్‌సిఎంఇ బృందం




శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డితో రోటరీ బృందం

రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ (ఆర్‌సీఎంఇ)కి చెందిన 22మంది సభ్యుల ప్రతినిధి బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ రాధిక సత్యనారాయణ నేతృత్వంలో వచ్చిన ఈ బృందంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వివిధ వృత్తి రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. శ్రీసిటీలోని ఆర్చురా ఫార్మా ఎం.డీ, క్లబ్ సభ్యుడు విక్రమ్ ఈ పర్యటనను సమన్వయం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, సమగ్ర పారిశ్రామిక వాతావరణం, అంతర్జాతీయ పెట్టుబడులకు శ్రీసిటీ ఎలా ఆకర్షణీయ గమ్యస్థానంగా ఎదిగిందనే అంశాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ ప్రతినిధి బృందాన్ని శ్రీసిటీకి ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ గురించి తెలుసుకోవాలన్న వారి ఆసక్తిని అభినందించారు. వారి అభిప్రాయాలు మాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నాయన్నారు. పర్యటనకు సహకరించిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ అధ్యక్షురాలు రాధిక సత్యనారాయణ, ఈ పర్యటన ఎంతో ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా సాగిందన్నారు. శ్రీసిటీ మౌలిక వసతులు, సమగ్ర ప్రణాళిక తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.

# బురదచల్లుడు రాజకీయాలు తగదు!

### ➤ వైసీపీ ఆరోపణలపై మండిపడ్డ మంత్రి నారాయణ



చెత్త తొలగింపునకు సంబంధించి వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న అర్థంపర్థం లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ వాళ్ళు బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా నెల్లూరులో అభివృద్ధిని అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. నెల్లూరులో ఆదివారం పర్యటించిన మంత్రి నారాయణ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించారు. అల్లీపురం డంపింగ్‌యార్డు సుమారు 60 ఏళ్లుగా ఉందని, డంపింగ్‌యార్డు కారణంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి కూడా నిలిచిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తను పెద్దఎత్తున తొలగించామని, లెగసీ వేస్ట్‌ను శాస్త్రీయంగా తొలగించేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు. టెండర్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరిగిందని, ఈ అంశంపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అవినీతికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రజల కోసం సొంత నిధులను కూడా ఖర్చు చేస్తున్నానని చెప్పారు. తమపై అవాస్తవ ఆరోపణలు, అభాండాలు కొనసాగిస్తే చివరకు నష్టపోయేది వైఎస్ఆర్‌సీపీయేనని హెచ్చరించారు.

# వేదికను జయించే సంభాషణ శక్తి : మాటలతో మెరుస్తున్న వ్యక్తిత్వం

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

వేదికపై నిలబడి మాట్లాడటం అనేది కేవలం మాటల కళ కాదు. అది మన వ్యక్తిత్వాన్ని వెలిగించే శక్తి. మన ఆలోచనలను ప్రపంచానికి వినిపించే అవకాశం. మనలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే వేదిక. యువతకు ఈ నైపుణ్యం అత్యంత అవసరం, ఎందుకంటే వారి భవిష్యత్తు అవకాశాలతో నిండిన దశలో ఉంది. ఆ అవకాశాలను అందుకోవడానికి మాటల శక్తి కీలకం. వేదిక అనేది మన వ్యక్తిత్వాన్ని పరీక్షించే స్థలం కాదు. అది మన వ్యక్తిత్వాన్ని వెలిగించే అవకాశం. వేదికపై మాట్లాడటం అంటే మనసులను గెలుచుకోవడం. ఒక మంచి ప్రసంగం ప్రేక్షకుల హృదయాలను తాకుతుంది. ఒక స్పష్టమైన మాట సందేహాలను తొలగిస్తుంది. ఒక ధైర్యమైన వాక్యం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వేదికపై మాట్లాడే ప్రతి అవకాశం మనలోని ఆత్మవిశ్వాసాన్ని పెంచే దారిగా మారాలి.

వేదికపై నిలబడిన క్షణంలోనే మన శరీర భాష ప్రేక్షకులకు మన గురించి ఒక సందేశం ఇస్తుంది. మన కళ్లలోని నమ్మకం, మన నిలువు తీరు, మన చేతుల కదలికలు.. ఇవన్నీమనం మాట ప్రారంభించేముందే మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఒక విద్యార్థి వేదికపై చిరునవ్వుతో ప్రారంభిస్తే, ప్రేక్షకులు అతనితో అనుబంధం ఏర్పరుచుకుంటారు. ఒక యువతి నిటారుగా నిలబడి మాట్లాడితే, ఆమె మాటలకు మరింత బలం వస్తుంది. శరీర భాష అనేది మాటలకు తోడువచ్చే నిశ్శబ్ద శక్తి. అది మన వ్యక్తిత్వాన్ని మెరిపించే అద్దం. వేదికపై మాట్లాడేటప్పుడు స్పష్టత అత్యంత ముఖ్యమైన అంశం. స్పష్టత లేకపోతే మాటలు గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఒక విద్యార్థి తన ప్రాజెక్ట్‌ను వేదికపై వివరించేటప్పుడు అర్థం కాని మాటలు, అసంపూర్ణ వాక్యాలు ఉపయోగిస్తే, అతని కృషి విలువ తగ్గిపోతుంది. కానీ అదే విద్యార్థి తన ఆలోచనను సరళంగా, క్రమబద్ధంగా, స్పష్టంగా చెప్పగలిగితే, అతని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. స్పష్టత అంటే మాటలను తగ్గించడం కాదు..భావాన్ని స్పష్టంగా చెప్పడం.

వేదికపై మాట్లాడేటప్పుడు చాలా మంది యువత భయం, సంకోచం, సందేహం వంటి భావాలతో బాధపడుతుంటారు. ఈ భావాలు సహజమే, కానీ వాటిని అధిగమించడం అవసరం. మాట్లాడటానికి ధైర్యం కావాలి, కానీ ఆ ధైర్యం సాధనతో వస్తుంది. ఒక విద్యార్థి ప్రతిరోజూ అద్దం ముందు రెండు నిమిషాలు మాట్లాడితే, అతని భయం తగ్గుతుంది. ఒక యువతి తరగతి గదిలో చిన్న చిన్న చర్చల్లో పాల్గొంటే, ఆమె ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. "ధైర్యం అనేది భయం లేకపోవడం కాదు; భయాన్ని అధిగమించడం" అనే మాట వేదికపై మాట్లాడే కళకు మార్గదర్శకం. వేదికపై మాట్లాడేటప్పుడు భావం ఉండాలి. భావం లేకుండా మాటలు శూన్యంగా మారిపోతాయి. ఒక ప్రసంగం ప్రేక్షకులను కదిలించాలంటే, మన మాటల్లో మనసు ఉండాలి. ఒక యువకుడు తన గ్రామంలో నీటి సమస్య గురించి వేదికపై మాట్లాడేటప్పుడు తన అనుభవాన్ని, తన బాధను, తన ఆశను కలిపి చెప్పితే, ప్రేక్షకులు అతని మాటలను హృదయంతో వింటారు. భావం అనేది మాటలకు జీవం. భావం ఉన్న మాటలు మనసులను గెలుస్తాయి.

వేదికపై మాట్లాడేటప్పుడు కథలు ఎంతో ప్రభావవంతంగా ఉంటాయి.కథలు మనసును ఆకట్టుకుంటాయి. కథలు భావాన్ని సులభంగా చేరుస్తాయి. ఒక ప్రసంగంలో చిన్న కథను చెప్పడం ద్వారా పెద్ద సందేశాన్ని అందించవచ్చు. కథలు మన మాటలను జీవంతో నింపుతాయి. ఇక్కడ ఒక చిన్న కథను గుర్తు చేసుకోవాలి. ఒక చిన్న గ్రామంలో చదువుతున్న రమేష్ అనే విద్యార్థి వేదికపై మాట్లాడటానికి ఎప్పుడూ భయపడేవాడు. ఒకరోజు పాఠశాల సభలో మాట్లాడే అవకాశం వచ్చింది. మొదట అతని చేతులు వణికాయి, మాటలు అడ్డంగా వచ్చాయి. కానీ రెండు నిమిషాల తర్వాత, తన గ్రామంలో నీటి సమస్య గురించి మాట్లాడటం ప్రారంభించగానే అతని మాటల్లో భావం వచ్చింది. సభలో ఉన్నవారు శ్రద్ధగా విన్నారు. ఆ రోజు రమేష్ గ్రహించాడు.. వేదికపై మాట్లాడటం అంటే భయాన్ని జయించడంకాదు.మనసులోని నిజాన్ని ధైర్యంగా చెప్పడం. ఈ చిన్న అనుభవం అతని జీవితాన్ని మార్చింది.

వేదికపై మాట్లాడేటప్పుడు వినడం కూడా అంతే ముఖ్యమైన భాగం. ప్రసంగం అనేది ఒకపక్క మాటలు చెప్పడం మాత్రమే కాదు.ప్రేక్షకుల స్పందనను అర్థం చేసుకోవడం కూడా. వినడం అనేది గౌరవం. వినడం అనేది అనుబంధం. వినడం అనేది సంభాషణలోని నిశ్శబ్ద శక్తి. వేదికపై మాట్లాడే కళ ఉద్యోగ ప్రపంచంలో మరింత కీలకం. ఒక యువకుడు తన ఆలోచనను స్పష్టంగా చెప్పగలిగితే, అతను నాయకత్వానికి ఎదుగుతాడు. ఒక యువతి తన టీమ్‌తో సమర్థవంతంగా మాట్లాడగలిగితే, ఆమె ప్రాజెక్ట్ విజయవంతమవుతుంది. ఉద్యోగ ప్రపంచంలో వేదికపై మాట్లాడే నైపుణ్యం అనేది ప్రతిభకు వేదిక.

వేదికపై మాట్లాడే నైపుణ్యం అనేది సాధనతో పెరుగుతుంది. ప్రతిరోజూ కొద్దిగా చదవడం, మంచి ప్రసంగాలు వినడం, మంచి రచనలు ఆస్వాదించడం, చిన్న చిన్న చర్చల్లో పాల్గొనడం..ఇవన్నీ మనమాట తీరు, మన భావ వ్యక్తీకరణ, మన ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరుస్తాయి. ఒక విద్యార్థి ప్రతిరోజూ ఒక చిన్న పేరాగ్రాఫ్ రాస్తే, అతని ఆలోచన క్రమబద్ధంగా మారుతుంది. ఒక యువతి ప్రతిరోజూ ఐదు నిమిషాలు మాట్లాడే సాధన చేస్తే, ఆమె మాటల్లో నమ్మకం పెరుగుతుంది. చివరగా, వేదికపై మాట్లాడే నైపుణ్యం యువతకు జీవితాంతం ఉపయోగపడే ఆస్తి. ఈ నైపుణ్యం వారి విద్యలో, ఉద్యోగంలో, నాయకత్వంలో, సంబంధాల్లో ప్రతిచోట ప్రభావంచూపుతుంది. మాటలతో మనం మనభవిష్యత్తును నిర్మించగలం. మాటలతోమనం అవకాశాలను తెరవగలం. మాటలతోమనంమనసులనుగెలుచుకోగలం. వేదికను జయించేసంభాషణశక్తి అనేది కేవలం ఒకనైపుణ్యం కాదు..అది వ్యక్తిత్వాన్ని వెలిగించే దీపం. ఆ దీపాన్ని వెలిగించడం యువత చేతుల్లోనే ఉంది.

**వచ్చే వారం :** భావజ్ఞానం : మనసును అర్థం చేసుకునే మానవీయ శక్తి



E-mail: reddyu@gmail.com

## పేదల ఇళ్ళ..
# రిజిస్ట్రేషన్‌ల కోసం.. సీపీఎం ప్రదర్శన




నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పేదల ఇళ్ళకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలంటూ నెల్లూరులో ఈనెల 15న సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని 17, 18, 19 డివిజన్లలోని అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్ళకి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకుడు, మాజీ డెప్యూటి మేయర్ మాదాల వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తొలుత, ముత్తుకూరు బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. నెల్లూరు నగరంలో సుమారు 40 ఏళ్ళుగా పలు ప్రాంతాల్లో పేదలు నివసిస్తున్నారని, రాష్ట్రప్రభుత్వం పరిశీలించి వారందరికీ ఇళ్ళ రిజిస్ట్రేషన్‌కి పూర్తిస్థాయిలో అనుమతులు మంజూరుచేయాలని ఆయన కోరారు. ఆమేరకు జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు పెంచలనరసయ్య, సతీష్, నజీర్, ప్రసాద్, మాలకొండయ్య, రఫీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛను దరఖాస్తులకు..గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న షేక్ షానవాజ్

జిల్లాలో సామాజిక పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఇచ్చిన గడువును పొడిగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షానవాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈనెల 15న నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల వరుస సెలవులు రావడంతో చాలా మంది పింఛన్లకు దరఖాస్తు చేసుకోలేకపోయారని, ప్రభుత్వం తొలుత ప్రకటించిన గడువును పొడిగించి వారందరికీ మేలు చేకూరేవిధంగా చూడాలని కోరారు. పింఛన్లను కోరుకునే వికలాంగులు, ఒంటరి మహిళలను పలానా సర్టిఫికెట్లు తేవాలని సచివాలయాల్లో చెప్తుండడంతో, వాటిని సరైన సమయంలో తెలుసుకోలేక, వాటిని అందించలేకపోతున్నారని, ఈ సమస్యలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆ దరఖాస్తులకు ఇచ్చిన గడువు తేదీని మరింతగా పెంచాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# ఓం.. శ్రీ గణాధిపతయే నమః

## • అంబరాన్నంటే సంబరంగా వినాయకచవితి



చిన్నబజారులోని ఆదిశేష గణపతి

వినాయకచవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అంబరాన్నంటే సంబరంగా జరుపుకున్నారు. వీధివీధినా పందిళ్ళు, మండపాలు నిర్మించి, రకరకాల వినాయకమూర్తులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. ఇళ్ళలోనూ, వినాయక మందిరాలు, శివాలయాల్లోనూ కొలువై ఉన్న విఘ్నేశ్వరునికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో వినాయకునికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వాడవాడలా చవితి వేడుకలతో సర్వత్రా పండుగ వాతావరణం మిన్నుముట్టింది.

### విద్యుద్దీపకాంతులతో కళకళలాడిన నగరం

ప్రత్యేకించి నెల్లూరు నగరంలో అన్ని సెంటర్‌లలోను వినాయక స్వామిని పూలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. అన్ని వీధుల్లోనూ వినాయక మండపాలు, స్వాగత ద్వారాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. వినాయక మండపాల కళకళలతో, విద్యుద్దీపాల వెలుగులతో నగరం శోభాయమానమైంది. ట్రంకు రోడ్డు శివాజీకూడలి, ఏసీ సెంటర్, కాపు వీధి, చిన్నబజారు, పెద్దబజారు, రంగనాయకులపేట, మూలాపేట, పొదలకూరు రోడ్డు, బాలాజీనగర్, ఏసీనగర్, దర్గామిట్ట, వేదాయపాళెం, అయ్యప్పగుడి.. ఇలా అన్నిప్రాంతాల్లోనూ అనేక రూపాల్లో విఘ్నేశ్వరుడు దర్శనమిచ్చాడు. ఎక్కడ చూసినా వినాయకుని కీర్తించే పాటలు, భక్తి కార్యక్రమాలు వెల్లువెత్తాయి. కొన్ని మండపాల్లో మూడు రోజులు, అయిదు రోజుల పాటు కూడా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్, పలువురు టీడీపీ–బీజేపీ–జనసేన నాయకులు చవితి వేడుకల్లో పాల్గొని గణాధిపతిని దర్శించుకుని పూజలు చేశారు.

### గణేష్‌ఘాట్‌లో క్రిక్కిరిసిన భక్తులు

నెల్లూరులోని స్వర్ణాల చెరువు ఒడ్డున ఉన్న గణేష్‌ఘాట్ భక్తుల రాకపోకలతో క్రిక్కిరిసిపోయింది. రెండోరోజు మంగళవారం కావడంతో సోమవారం సాయంత్రమే అనేకమంది ఇళ్ళలో పూజలు చేసుకున్న వినాయకుడికి ఉద్వాసన చెప్పి నిమజ్జనోత్సవానికి తరలించారు. సాయంత్రానికల్లా గణేష్‌ఘాట్‌కి వేలాదిమంది భక్తులు నిమజ్జనోత్సవాలకు తరలిరావడంతో ఈ ప్రాంతం భక్తజనప్రవాహంతో నిండిపోయింది. విక్రమసింహపురి గణేష్ సేవా సమితి, గణేశుని భక్తబృందాల వారు ఈ కార్యక్రమాలను ర్యవేక్షించారు. తొలుత, చెరువుగట్టుపై నిర్మించిన స్వర్ణగణపతి మండపాన్ని ప్రారంభించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన గంగా హారతుల కార్యక్రమాల్లో మంత్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### మాగుంట లేఅవుట్‌లో విశేష పూజలు :

నగరంలోని మాగుంట లేఅవుట్ లంబోదర సెంటర్‌లో ఏర్పాటుచేసిన విద్యాగణపతికి విశేషపూజలు చేశారు. విద్యార్థులను, చిన్నారులను ఆశీర్వదిస్తూ నిర్వాహకులు వారికి నోటుపుస్తకాలు, పెన్‌లు బహుకరించారు. అనంతరం కన్నులపండువగా ఉట్టి మహోత్సవం జరిగింది. లంబోదర వినాయకుని విగ్రహం వద్ద ప్రముఖ న్యాయవాది జి.వేణుగోపాల్ నాయుడు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తన కుమారుడు శ్రేయష్ పుట్టిన రోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో నేత్రపర్వంగా పూజలు జరిగాయి. టీడీపీ నాయకులు దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వేదాయపాళెంలో సింహపురి ఉత్సవ కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదగణపతి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని భక్తులు వేలసంఖ్యలో దర్శించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేసి, సాయంత్రం స్వామివారికి కన్నులపండువగా చందనాలంకారం నిర్వహించారు. ఈనెల 23వ తేదీ వరకు ఈ ఆలయంలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి.

## కొండాయపాళెం గేటు, బీవీనగర్
# రైల్వే అండర్‌బ్రిడ్జిల పనుల పరిశీలన


రైల్వే అధికారులతో కలిసి పనుల కోసం పరిశీలన చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు, బి.వి. నగర్‌లో ఎట్టకేలకి రైల్వే అండర్ బ్రిడ్జి పనులకి అనుమతులు మంజూరయ్యాయి. రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి చొర వతో, స్థానిక నాయకుల సహకారంతో ఆ మేరకు అనుమతులు రావ డంతో స్థానికుల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కొండాయపాళెం గేటు, బీవీనగర్‌లకి వెళ్లే రోడ్డు ఎప్పుడూ జనసమ్మర్ధంగా ఉండడం, తరచూ రైలు గేట్లు వేసి ఉంచాల్సి రావడంతో, ఆ దారుల్లో వెళ్లే ప్రజలు బాగా ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్యని దృష్టిలో పెట్టుకుని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అండర్‌బ్రిడ్జిల కోసం కృషిచేయడంతో ఆ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ పనుల ప్రారంభం కోసం రైల్వే అధికారులు, ఆర్ అండ్ బీ, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, విద్యుత్ అధికారులతో కలిసి ఇటీవల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలన చేశారు.

## అక్కచెరువుపాడు వద్ద డాగ్స్‌షెల్టర్

నెల్లూరులోని 31వ డివిజన్ అక్కచెరువుపాడు వద్ద ఇటీవల 40 లక్షల రూపాయలతో వ్యయంతో నిర్మించనున్న డాగ్స్ షెల్టర్ నిర్మాణ పనులకు టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కుక్కల బెడద నివారించడంతో పాటు, వాటికి సురక్షితమైన ప్రదేశంగా డాగ్స్ షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్‌లో 857 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## 22 నుంచి..
# బీసీ భవన్ నిర్మాణ పనులు
### - ఎమ్మెల్సీ బీద రవిచంద్ర -

నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణ పనులు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమవు తాయని జిల్లా టీడీపీ అధ్యక్షుడు.. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చెప్పారు. ఇటీవల ఆయన ఆ పనులు పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ భవన్ నిర్మాణ పనులు మొదలెట్టింది తమ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని, త్వరలోనే ఆ పనులను పూర్తి చేస్తుందని తెలిపారు. బీసీ భవన్ నిర్మాణ పనులు, పురోగతిపై పలు దఫాలుగా జిల్లా బీసీ సంఘాలు, బీసీ సంక్షేమ అధికారులు, ఇంజినీర్లతో సమావేశాలు నిర్వహించి, పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. బీసీ భవన్ నిర్మాణం కోసం మంత్రి పొంగూరు నారాయణ కోటి రూపాయల సొంత నిధులు ఇచ్చారని, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు తమ ఎంపీ నిధుల నుండి కోటి 25 లక్షల రూపాయలు కేటాయించారని ఆయన తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీసీ భవన్ నిర్మాణంకై త్వరలో నిధులు అందించేందుకు ముందుకు వచ్చా రని ఆయన వివరించారు.

# వెంకటగిరిలో గెలుపు వైసీపీదే!
### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రానున్న స్థానిక ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఆ పార్టీ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు జగనన్న చేసిన మంచే మనకు శ్రీరామరక్షగా ఉంటుందని అన్నారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో వెంకటగిరి మున్సిపాలిటీతో పాటు వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. త్వరలో మండల స్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించి మండల గ్రామస్థాయి నాయకులకు పార్టీ గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీకి వెంకటగిరి నియోజకవర్గంలో పటిష్ట మైన క్యాడర్, బలమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినా వైఎస్సార్‌సీపీకి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 శాతం ఓటు బ్యాంకు ఉందన్నారు. ప్రజల కోసం నిలబడటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత నెలకొందని, స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. స్థానిక ఎన్నికలు వైఎస్సార్‌సీపీ క్యాడర్ సత్తా చాటుతాయన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ కృషిచేయాలని ఆయన వైసీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# గూడూరు డివిజన్

# ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక ల్యాబ్
### • ప్రారంభించిన ఎమ్మెల్యే పాశం


ల్యాబ్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఒక కోటి 25 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సమగ్ర ప్రజా ఆరోగ్య పరీక్ష కేంద్రాన్ని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో అరుణకుమారితో కలిసి ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే ఏరియా ఆసుపత్రి అభివృద్ధి జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 22 కేంద్రాల్లో అత్యాధునిక వసతులతో ల్యాబ్‌లు ప్రారంభించడం జరిగిందని, వాటిలో గూడూరు కూడా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ ల్యాబ్‌లో థైరాయిడ్, క్యాన్సర్ వంటి అనేక పరీక్షలు చేస్తారని తెలియజేస్తూ అసంపూర్తిగా నిలిచిపోయిన ఆసుపత్రి నూతన భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కమిషనర్ మల్లికార్జునరావు, కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, భారతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా తదితరులు పాల్గొన్నారు.

# గూడూరుని జిల్లా కేంద్రం చేయాలి
### ➢ 300వ రోజుకు చేరిన కంకణాల శిబిరం



గూడూరుని జిల్లా కేంద్రం చేయాలని నినదిస్తున్న పెంచలనాయుడు

గూడూరు, గాంధీ బొమ్మ సెంటర్ వద్ద భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వ ర్యంలో గూడూరును జిల్లా కేంద్రం చేయాలని జరుగుతున్న శిబిరం 300వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు జిల్లా కేంద్రం అవడానికి అన్ని వనరులున్నాయని, భవిష్యత్ తరాలు ఎంతో అభివృద్ధి చెందుతా యని, ప్రభుత్వం వెంటనే గూడూరును జిల్లా కేంద్రం చేయాలని కోరారు.

# రాజీతోనే ఇరు వర్గాల విజయం


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో ఇటీవల జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులతో మాట్లాడి పలు కేసులను పరిష్కరించారు. గూడూరు జడ్జి మధుబాబు మాట్లా డుతూ చిన్న చిన్న తగాదాలు వేసుకొని కేసులు పెట్టుకుని కోర్టు చుట్టూ సంవత్సరాల తరబడి తిరగడం వల్ల సమయాన్ని, డబ్బుని పోగొట్టుకుంటుంటారని, లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించి నట్లయితే ఇరువర్గాల వారు విజయం సాధించినట్లేనని, రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ మెగా లోక్‌అదాలత్ జరుగుతుందని, కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. లాయర్లు సాయికుమార్‌రెడ్డి, కోటేశ్వరరావు, పార్వతయ్య, మహబూబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సి.రోహిణి

ఆంధ్ర మహిళా మండలి మరియు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఇటీవల గూడూరు పట్టణంలోని మహిళా మండలి భవనంలో మట్టి వినాయక బొమ్మలను ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని, రసాయ నాలు వాడిన బొమ్మలు నీటిలో వేస్తే నీరు కాలుష్యం అవుతుం దని అన్నారు. ప్రతి సంవత్సరం మహిళా మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక బొమ్మలను అందిస్తున్నామని పేర్కొన్నారు. నిర్మల, సుప్రియ, అమరావతి, శశికళ, స్నేహలతరెడ్డి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



# 'లయన్స్' ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే


సత్కారం అందుకుంటున్న ఏఇఇ ఉదయ్‌భాస్కర్

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మ దినాన్ని పురస్కరిం చుకుని ఇటీవల గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాల యంలోని మీటింగ్ హాల్‌లో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఉత్తమ ఇంజనీర్‌లను లయన్స్ క్లబ్ సభ్యులు మరియు రిటైర్డ్ ఈఈ యస్.గిరినాథ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విందురూ గ్రామానికి చెందిన పేద విద్యార్థి డి.పార్వతి ఫస్ట్ ఇయర్ బీటెక్ ఫీజుగా 26000 రూపాయలు లయన్స్ క్లబ్ ద్వారా అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే.శివయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.అనిత, పిఆర్ డిప్లమో ఇంజనీర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, రూపేష్‌రెడ్డి, మురళీరెడ్డి, రవిచంద్ర, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక రచన చేసిన ఎల్.ఏ.పి విద్యార్థిని కనిష్క



లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న పూడి కనిష్క అనే విద్యార్థిని సుమారు 204 పేజీలతో 'బియాండ్ ది షాడోస్' అనే పుస్తకాన్ని ఇంగ్లీషులో రచించి అందరిని ఆశ్చర్యంతో ముంచెత్తింది. ఈ నెల 16న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రముఖ సైకాలజిస్ట్ సింగంశెట్టి అభిషేక్ చేతులమీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుదర్శన, ప్రిన్సిపాల్ నమశ్శివాయ తదితరులు పాల్గొని కనిష్కని అభినందించారు.

# శోభాయమానంగా.. శ్రీ మహాలక్ష్మీ దీప పూజ

## దీపకాంతులతో కళకళలాడిన ఏసీ స్టేడియం

## విపిఆర్ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా పూజలు





శ్రావణ శుక్రవారం సందర్భంగా ఈనెల 11వ తేదీ సాయంత్రం శ్రీ మహాలక్ష్మీ దీప పూజ కార్యక్రమంతో నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం దేదీప్యమానమైంది. సాక్షాత్తూ అమ్మవారి కోవెల ఉన్న తిరుచానూరు నుంచి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు-శ్రీవారి దేవతామూర్తుల విగ్రహాలను తీసుకువచ్చి, వేదికపై ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు చేయడం భక్తులను బాగా ఆకట్టుకుంది. నెల్లూరులో ఇలా శ్రీమహాలక్ష్మీ దీప పూజను నిర్వహించడం ఇదే తొలిసారి కూడా. అమ్మవారిని సుగంధభరిత పుష్పాలతో కన్నులపండువగా అలంకరించి.. వేద మంత్రాలు, మంగళవాద్యాల మధ్య పూజలు చేశారు. దీపకాంతులతో ఆ ప్రాంతమంతా ప్రకాశమానమైంది. గోవిందనామాలతో ఏసీ స్టేడియం ప్రాంగణం మార్మోగింది. ఎంతో పుణ్యప్రదమైన ఈ కార్యక్రమానికి భక్తులు నెల్లూరు నుంచే కాక, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తిశ్రద్ధలతో తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ), వీపీఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. ఆయన సతీమణి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీసూక్త పారాయణం, మహాలక్ష్మీ పూజ, అష్టోత్తరశతనామ కుంకుమార్చనలు వేడుకగా జరిగాయి. తిరుచానూరుకు చెందిన అర్చకస్వాముల నేతృత్వంలో వేదపండితులు ఈ పూజలను నేత్రపర్వంగా నిర్వహించారు. కుంకుమ పూజ అనంతరం దీపపూజ నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ స్వామివారి కంకణాలు, పసుపుదారాలు పంపిణీ చేయడంతో పాటు ప్రసాద వితరణ చేశారు. నగరంలోని అనేక మంది ప్రముఖులు, అత్యధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### దీప పూజ ఎంతో పుణ్యప్రదం - ప్రశాంతమ్మ

భక్తులను ఉద్దేశించి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. శ్రావణ శుక్రవారం సాయంత్రం మన నెల్లూరులో టీటీడీ, ఎస్వీబీసీ ఆధ్వర్యంలో దీపపూజ జరగడం చాలా గొప్ప విషయమని, ఇది మనందరి అదృష్టమని అన్నారు. మహాలక్ష్మీ అమ్మవారికి దీపపూజ చేయడం ఎంతో పుణ్యప్రదమన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో వేమిరెడ్డి దంపతులుగా తాము ఈ పూజల్లో పాల్గొనడం ఆ భగవంతుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నామన్నారు. ఏ దైవ కార్యక్రమం చేయాలన్నా భగవంతుడి అనుగ్రహం తప్పనిసరిగా ఉండాలని, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం తమ పూర్వజన్మ సుకృతమని అన్నారు. ఇది తాము చేస్తున్న సేవ కాదని.. భగవంతుడే తమతో ఈ సేవ చేయించు కుంటున్నారని భావిస్తున్నామని ఆమె అన్నారు. శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని తాము ప్రార్థిస్తున్నామన్నారు.

## ప్రమాద బాధితుడిని కాపాడితే...

# రూ.25 వేల ప్రోత్సాహకం

## • 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలిస్తే 'రాహ్-వీర్'గా గుర్తింపు

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రుడిని చూస్తూ వెళ్లిపోకుండా, సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న 'రాహ్-వీర్' పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ.25 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందుతుంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తొలి గంట అత్యంత కీలకం. వైద్య పరిభాషలో దీనినే 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారు. ఈ సమయంలో బాధితుడికి వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశం పెరుగుతుంది. అందుకే ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని సమీప ఆసుపత్రికి తరలించేలా ప్రజలను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

### సహాయం చేయడానికి భయపడాల్సిన అవసరం లేదు

ప్రమాద బాధితుడికి సహాయం చేయడానికి ముందుకొచ్చే వ్యక్తులను 'రాహ్-వీర్'గా గుర్తిస్తున్నారు. మంచి ఉద్దేశంతో బాధితుడికి అత్యవసర వైద్య లేదా ఇతర సహాయం అందించిన వారికి చట్టపరమైన రక్షణ కూడా కల్పించే నిబంధనలు ఉన్నాయి. దీంతో పోలీసు, ఆసుపత్రి వ్యవహారాలపై అనవసరమైన భయంతో బాధితుడిని పట్టించుకోకుండా వెళ్లిపోయే పరిస్థితిని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

### రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంపు

గతంలో ఉన్న ప్రోత్సాహకాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించి రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. 2025లో సవరించిన 'రాహ్-వీర్' మార్గదర్శకాల ప్రకారం తీవ్రమైన రోడ్డు ప్రమాద బాధితుడిని గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వ్యక్తికి ఈ పురస్కారం అందుతుంది. ఇది కేవలం నగదు ప్రోత్సాహకం మాత్రమే కాకుండా, "ప్రమాదం చూసినప్పుడు పక్కకు వెళ్లిపోవడం కాదు.. ఒక ప్రాణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలి" అనే సామాజిక బాధ్యతను పెంపొందించే ప్రయత్నంగా చూడవచ్చు.



రోడ్లపై జరిగే ప్రతి ప్రమాదంలో వైద్య సిబ్బంది సకాలంలో చేరే పరిస్థితి ఉండకపోవచ్చు. అలాంటి సమయంలో అక్కడ ఉన్న సాధారణ పౌరుడే బాధితుడికి తొలి సహాయకుడిగా మారే అవకాశం ఉంటుంది. ఆ ఒక్క గంటలో తీసుకునే నిర్ణయం ఒక కుటుంబానికి ప్రాణాన్ని తిరిగి ఇవ్వగలదు. అందుకే 'రాహ్-వీర్' వంటి కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

## ఆత్మకూరులో తొలిసారిగా..

# వినాయక నిమజ్జనోత్సవాలు

## -మంత్రి ఆనం సారథ్యంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు-



నిమజ్జనోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు పట్టణ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా, తొలిసారిగా వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా గణనాథునికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు స్వాగత వేదికను ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి దక్కింది. వినాయక నిమజ్జనోత్సవంలో భాగంగా గణనాథుని విగ్రహాలకు స్వాగతం పలికి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించేలా ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద ప్రత్యేక స్వాగత వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి ఆనం మార్గదర్శకత్వంలో, గణేష్ ఉత్సవ కమిటీ మరియు ఎన్డీఏ కూటమి నాయకులు బిజెపి, జనసేన, టీడీపీ శ్రేణులు దగ్గరుండి పర్యవేక్షించారు. నిమజ్జనోత్సవం ఆనందోత్సాహాల మధ్య, క్రమశిక్షణతో జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజల్లో సంతోషం వెల్లువెత్తింది.

# కూటమి పార్టీ నేతల సమావేశం

## • 9మందితో కోఆర్డినేషన్ కమిటీ నియామకం



స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, ఈనెల 15న నెల్లూరులో కూటమి పార్టీల నేతలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, అభ్యర్థుల ఎంపిక నుంచి, పోలింగ్ దశ వరకు అందరూ ఐక్యంగా ఉండి ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని తీర్మానించుకున్నారు. ఆమేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకి తోడ్పడేవిధంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల వారు 9మందితో కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటుచేశారు. టీడీపీ నుంచి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జోనల్ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నుంచి ఆర్టీసీ జోనల్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రఘునాథరాజు, జనసేన నుంచి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాగరత్నమ్మలు ఆ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారు. ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ సమన్వయకర్తగా ఉంటారు. స్థానికసంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించుకున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలుచేస్తున్న పథకాలను, రాష్ట్రం కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించుకున్నారు.

# మునిసిపల్ ఎన్నికలకు రెడీ!

## • 54 నుంచి 72కి పెరిగిన డివిజన్లు

మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం సంకల్పించడంతో ప్రభుత్వ యంత్రాంగం ఆమేరకు ఏర్పాట్లకు సమాయత్తమవుతోంది. రాష్ట్రంలోని పురపాలక, నగరపాలక సంస్థల్లో వార్డుల పునర్విభజనకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఆమేరకు ప్రక్రియల ఏర్పాటు ఊపందుకుంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో కొత్త డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి గత కొద్దిరోజులుగా చేస్తున్న కసరత్తు కూడా ఎట్టకేలకు పూర్తయింది. 54 డివిజన్లు ఉన్న నెల్లూరు కార్పొరేషన్ పరిధి ఇప్పుడు 72 డివిజన్లకు పెరిగింది. ఈనెల 16వ తేదీన ఆమేరకు అధికారికంగా ప్రకటించారు కూడా. డివిజన్ల పెంపే విషయంలో వచ్చిన సలహాలు, సూచనల మేరకు కొత్తగా జాబితాను సిద్ధం చేసి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కి పంపగా, వారు ఆమోదం తెలపడంతో తాజాగా తుదిజాబితాను విడుదల చేశారు. డివిజన్ల సరిహద్దులను కూడా ప్రకటించారు. నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం నియోజకవర్గాల పరిధిలో నెల్లూరు నగరపాలకసంస్థ పరిధి విస్తరించి ఉండడంతో, పునర్విభజన తర్వాత ఈ రెండు నియోజకవర్గాల్లో తాజాగా 36 డివిజన్ల వంతున మొత్తం 72 డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఒక్కసారిగా 18 సీట్లు పెరగడంతో ఎన్నికల్లో పోటీచేయదలచుకున్నవారిలో ఆశలు చిగురించాయి. నవంబరు 22వ తేదీతో నగరపాలక సంస్థ పాలకవర్గం గడువు ముగుస్తుండడంతో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే.

# వీఆర్సీ గ్రౌండ్‌కు మహర్దశ

## - - - మంత్రి నారాయణ హామీ - - -



వాకర్స్‌తో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీలోని వీఆర్సీ హైస్కూల్ గ్రౌండ్‌ను క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం వీఆర్సీ గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మంత్రి మాట్లాడారు. గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్‌డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని వాకర్స్ మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి నారాయణ అక్కడికక్కడే స్పందించి, అవసరమైన పనులను ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ నందన్‌ను ఆదేశించారు. ఆరు నెలల్లో వాకర్స్ కోరుతున్న సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేసి రాత్రివేళల్లోనూ క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మంత్రికి వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్సీ గ్రౌండ్‌లో చిన్నారులు బాస్కెట్‌బాల్ ఆడుతుండటాన్ని చూసిన మంత్రి నారాయణ వారితో కలిసి కాసేపు సరదాగా బాస్కెట్‌బాల్ ఆడారు. స్వయంగా గోల్ వేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

### నారాయణ 'స్వచ్ఛ హై సేవ'

పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ సాధించాలంటే ప్రజల్లో అవగాహనతో పాటు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు సిటీలోని జెండావీధిలో ఈనెల 17 గురువారం నాడు నిర్వహించిన స్వచ్ఛ హై సేవా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి నారాయణ, అధికారులు, టీడీపీ నాయకులు జెండావీధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

## తలసేమియా చిన్నారులకు

# ఉచిత మెగా వైద్య శిబిరం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖలో మాడభూషి వి.సారంగపాణి తలసేమియా సెంటర్, నెల్లూరు ఆధ్వర్యంలో ఈనెల 17 గురువారం నాడు తలసేమియా చిన్నారుల కోసం ఉచిత మెగా మెడికల్ చెకప్ మరియు ఎకో క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో తలసేమియా చిన్నారులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, ఎత్తు, బరువు కొలతలు, గ్రోత్ మానిటరింగ్, హార్మోనల్ మరియు ఎండోక్రైన్ సమస్యల పరిశీలనతో పాటు ఎకోకార్డియోగ్రఫీ, గుండె పరీక్షలు మరియు గుండె నిర్మాణానికి సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు హరిత, డాక్టర్ భార్గవి, డా. లావణ్య, డా. విష్ణువందన పాల్గొని సేవలందించారు. తలసేమియా ప్రాజెక్టుకు సంబంధించిన సేవలను డా. సీత, ఎగ్జిక్యూటివ్ సేవా మెంబర్ అందించారు. ఈ శిబిరంలో మొత్తం 120 మంది తలసేమియా చిన్నారులు మరియు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం, దివంగత అన్నదాత రమాకుసుమ జన్మదినాన్ని పురస్కరించుకుని శిబిరానికి హాజరైన చిన్నారులకు మరియు సభ్యులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ అడ్ హాక్ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగారావు, చమర్తి జనార్ధన్‌రాజు, రెడ్ క్రాస్ నెల్లూరు శాఖ సెక్రెటరీ పి. మస్తానయ్య, సిబ్బంది శ్రీమతి స్వప్న తదితరులు పాల్గొన్నారు.




బాధితులకి చెక్కుని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నరసింహమూర్తి

# లోక్ అదాలత్‌తో.. సత్వర న్యాయం

## • జిల్లా ప్రధాన న్యాయమూర్తి నరసింహమూర్తి

జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు త్వరితగతిన న్యాయం పొందే అవకాశం ఉందని, పేు కోర్టు ఖర్చులు మరియు విలువైన సమయాన్ని కూడా ఆదా చేసుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నరసింహమూర్తి చెప్పారు. ఏ కేసులోనైనా రాజీ ద్వారా వ్యాజ్యాలను పరిష్కరించుకోవడం రాజమార్గమని ఆయన అన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న లోక్ అదాలత్ భవన్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి వై జె పద్మశ్రీ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా న్యాయసేవ అధికార సంస్థలో ఈ కార్యక్రమం చేపట్టారు. కేసుల పరిష్కారంలో భాగంగా, ఒక యాక్సిడెంట్ కేసుకు సంబంధించి యునైటెడ్ ఇన్సూరెన్స్ వారు 74 లక్షల రూపాయల చెక్కును చనిపోయిన అతని భార్య పిల్లలకు ఆయన ద్వారా అందజేశారు. ఆ తర్వాత, ఫ్యామిలీ కోర్టులో ఓ విడాకుల కేసుకు సంబంధించి వారి బంధువులనుపిలిపించి రాజీ కుదిర్చారు. ఆ దంపతులిద్దరూ మళ్లీ ఒకటయ్యేలా చేసి, అందరి సమక్షంలో వారిచే దండలు మార్పించారు. జిల్లాలో మొత్తంగా 30,694 కేసులను పరిష్కరించగా, పరిహారం కింద సుమారు ఆరుకోట్ల రూపాయలను బాధితులకు అందజేశారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేసి జిల్లా న్యాయాధికారి సూచనలతో అదనపు జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు లోక్‌అదాలత్‌ని విజయవంతం చేశారు.

# ఎన్‌బికేఆర్‌లో.. ఇంజినీర్స్ డే వేడుకలు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బికెఆర్ సిబ్బంది

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న ఇంజినీర్స్ డేను వేడుకగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంలో ఇంజినీర్లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడటం ఇంజినీర్ల ప్రధాన బాధ్యతలని తెలిపారు. మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఇంజినీర్లు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీహరిరెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు రామకృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇందులో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులు, వర్కింగ్ మోడళ్లను ప్రదర్శించారు.

### సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో..

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలోనూ ఇంజినీర్స్ డేని నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.పి.వి.సుబ్బారెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ తన ఇంజినీరింగ్ నైపుణ్యం, పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేయించారని కొనియాడారు.

# అక్షరాంధ్ర శిక్షణ సమావేశం

జిల్లా అక్షరాంధ్ర జిల్లా స్థాయి అవగాహన శిక్షణ సమావేశం ఈనెల 17 గురువారం నాడు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో అక్షరాంధ్ర డిప్యూటీ డైరెక్టర్ మల్లు మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి పట్టణస్థాయి వార్డు స్థాయిలో అక్షర కేంద్రాలు లో అక్షరాంధ్ర తరగతులు పకడ్బందీగా జరగాలన్నారు. ఎంపీడీవోలు ఏపీఎంలు ఏపీవోలు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు మున్సిపల్ కమిషనర్లు డిఆర్డిఏ డ్వామా సిబ్బంది బాధ్యతగా ఆ కేంద్రాలను నిర్వహించాలని చెప్పారు. ఏడీసీ హిమబిందు, ఐసిడిఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ మెప్మా ఏవో, అన్ని మండలాల ఎంపీడీవోలు ఏపీవోలు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ పట్టణానికి సంబంధించి సిసిఎంలు ఆర్పీలు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో షటిల్ బస్సు సర్వీసులు




బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న విజయ భరత్‌రెడ్డి

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) ఆధ్వర్యంలో శ్రీసిటీలో అంతర్గత ఉచిత షటిల్ బస్సు సర్వీసులను ప్రారంభించారు. గురువారం ఉదయం జీరో పాయింట్ వద్ద ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ భరత్‌రెడ్డి జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమలతో పాటు ఈ ప్రాంత నివాసితుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పనిదినాలలో ప్రతి 45 నిమిషాలకు పారిశ్రామికవాడలోని వివిధ ముఖ్య ప్రాంతాలను అనుసంధానిస్తూ బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు చూపించి షటిల్ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీలో సామాజిక మౌలిక వసతులను బలోపేతం చేయడంలో ఇదో మరో ముందడుగుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. పారిశ్రామికవాడలో పర్యావరణహిత, సౌకర్యవంతమైన రవాణా సదుపాయం అందించడం ద్వారా ఉద్యోగులు, విద్యార్థులు, సందర్శకులు, పరిసర గ్రామాల ప్రజలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

# రసాయనశాస్త్రంలో..శ్రీవాణికి డాక్టరేట్

నెల్లూరు జిల్లా విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీవాణికి డాక్టరేట్ లభించింది. కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ద్వారా "స్పెక్ట్రో ఫోటో మెట్రిక్ డిటర్మినేషన్ ఆఫ్ జింక్ యూజింగ్ డిఎడి హెచ్‌పి యాస్ కాంప్లెక్సింగ్ ఏజెంట్" అనే అంశంపై నెల్లూరులోని వి.ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఇటీవల రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ (పిహెచ్‌డి) ప్రదానం చేసింది.

# మహేందర్‌కి.. 'పెరసం' పురస్కారం

తెలంగాణకి చెందిన ప్రముఖ కవి బి.మహేందర్ రచించిన 'నేను మరణిస్తూనే ఉన్నాను' కవితా సంపుటి, పెన్నా సాహిత్య పురస్కారం-2026కి ఎంపికైందని పెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి తెలిపారు. నెల్లూరులో త్వరలో నిర్వహించనున్న పెరసం 17వ వార్షికోత్సవ సభలో విజేతకు నగదు పురస్కారం అందజేస్తామన్నారు.

# క్రికెట్ జట్లకు రిజిస్ట్రేషన్లు

జిల్లాలోని క్రికెట్ సెంటర్లలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు క్రీడాకారుల జట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతాయని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈనెల 16న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నెల్లూరు, కావలి, కావలి, వెంకటగిరి, గూడూరు కేంద్రాల్లో అండర్-14 బాలుర క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉంటుందని, క్రీడాకారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆశ కార్యకర్తల పోస్టులకు..

# దరఖాస్తులు పంపండి

జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం పథకం కింద పలు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో 29 ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేస్తున్నామని, అందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుజాత ఈనెల 16న ఒకప్రకటనలో తెలిపారు. 25 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారు అర్హులని, వివరాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లేదా అర్బన్ పీహెచ్‌సీలలో సంప్రదించాలని వివరించారు.

# వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి!

## • పార్టీ శ్రేణులకి యువనేత లోకేష్ పిలుపు

వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆ గొద్దలి పార్టీ కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర విద్యామంత్రి, యువనేత నారా లోకేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కోవూరులో ఈనెల 16న ఆయన ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతో కలసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతర జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించాలన్నారు. అందుకు అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వం లోని పార్టీలు కలిసే పోటీచేస్తాయన్నారు. పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలు నాయకుల చుట్టూ కాక, ప్రజల చుట్టూ తిరగాలన్నారు. వారిని గుర్తించి బాధ్యత తనదని స్పష్టం చేశారు.

### నెల్లూరు గడ్డపై ఎంతో గొప్పవాళ్ళు జన్మించారు :

నెల్లూరు గడ్డపై ఎంతో గొప్పవాళ్లు జన్మించారని, స్వాతంత్ర్య సమరయోధుడు డా. బెజవాడ గోపాలరెడ్డి కోవూరు నియోజకవర్గం వారేనని లోకేష్ గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఈ నియోజకవర్గానికి చెందిన బెజవాడ పాపిరెడ్డి తొలి కార్యకర్తగా చేరారని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో గెలిచి వేరేపార్టీలోకి పోయిన వాళ్ళున్నారని ఆయన అంటూ, అయినప్పటికీ ఎత్తిన పసుపుజెండా దించని కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ అండగానే ఉన్నారని చెప్పారు. కోవూరులో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం లేని లోటును తీర్చినందుకు ఆయన వేమిరెడ్డి దంపతులను అభినందించారు.


### డీఎస్సీకి..ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్ :

వైసీపీ అధినేత జగన్‌కి డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా కూడా తెలియదని, అలాంటి వారు తనను ప్రశ్నించడం విడ్డూరమని లోకేష్ ఘాటుగా విమర్శించారు. డిఎస్సీ అంటే జగన్‌కి డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఒక్క టీచర్ పోస్టును కూడా ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక 16వేల టీచర్ పోస్టులు ఇస్తే, వైసీపీ వారు దానిపై కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 'డిఎస్సీపై చర్చకు నేను, సిద్ధం, జగన్ సిద్ధమా'.. అంటూ ఆయన సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు కులం ముసుగులో జనంలోకి వస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అయిదేళ్ల వైసీపీ అరాచకాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వైకాపా నాయకులు ఫస్ట్‌గ్రేడ్ క్రిమినల్స్ అని, రాజకీయం ముసుగులో కులమత విద్వేషాలు రెచ్చగొడతారని, వారి దుష్ప్రచారాలను ఖండించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి నారా లోకేష్, వేమిరెడ్డి దంపతులు.. తదితర నాయకులు

### 'ప్రశాంతిరెడ్డి గురించి.. తప్పుగా మాట్లాడితే సహించం' - లోకేష్ హెచ్చరిక



ప్రజల కోసం ప్రశాంతిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని, వారిది గౌరవంగా బతికే కుటుంబమని, ఏనాడూ తప్పు చేయలేదని ఈ సందర్భంగా లోకేష్ కొనియాడారు. అయితే, కొంతమంది రౌడీలు, నియోజకవర్గానికి ఒక్కవని చేయని వారు ఆమె గురించి మాట్లాడుతున్నారన్నారు. 'త్వరలో మీ టైం కూడా వస్తుంది, ఎవరినీ వదలిపెట్టం' అని ఆయన హెచ్చరించారు. నీతి,నిజాయితీగా ప్రజలకోసం రాజకీయాల్లోకి వచ్చిన విపిఆర్ కుటుంబం గురించి, వారి క్యారెక్టర్ గురించి మాట్లాడే హక్కు వైసిపి నాయకులకు ఎవరిచ్చారని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి అటువంటి మాటలు మాట్లాడితే వారి సంగతి చూస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. డబ్బులు ఎంతోమంది సంపాదిస్తారని, కానీ ప్రజల కోసం మంచి చేయాలనే తపన విపిఆర్ దంపతుల్లో ఉందని, ప్రజల కోసమే వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చారని ఆయన చెప్పారు. కోవూరు టీడీపీకి కంచుకోట అని ఆయన అన్నారు. 'అసెంబ్లీలో సైకోలు చేసిన వ్యక్తిత్వ హనన వ్యాఖ్యల వల్ల నా తల్లి మూడునెలలు బాధపడింది, ఏనాడు నేను జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల గురించి మాట్లాడలేదు. ఆయన భార్య భారతి గురించి ఓ కార్యకర్త మాట్లాడితే జైలుకు పంపించాం' అని ఆయన చెప్పారు. పార్టీ ఏదైనా రాజకీయం వేరు, కుటుంబం వేరుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

---

# 'మానవసేవే..మాధవసేవ'గా.. సేవా కార్యక్రమాలు

## ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా..17 నుంచి దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప అభియాన్'



***సెప్టెంబర్ 17వ తేదీ భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ పుట్టినరోజు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశ వ్యాప్తంగా "సేవా సంకల్ప అభియాన్" పేరుతో సమాజ శ్రేయస్సుకై అనేక సేవా కార్యక్రమాలను చేపట్టబోతోంది. ముఖ్యంగా, "మానవసేవే మాధవ సేవ" అని స్వామి వివేకానంద చెప్పిన సూక్తికి స్ఫూర్తిగా భారతీయ జనతా పార్టీ 13రకాల సేవా కార్యక్రమాల ద్వారా దేశంలో దాదాపు 50 కోట్ల మంది ప్రజానీకానికి చేరువ అవుతోంది.***

ఈ సేవా కార్యక్రమాలలో భాగంగా 'అంగన్వాడీ మిలాన్' పేరుతో దేశంలోని 14 లక్షల మంది అంగన్‌వాడి ఆయాలను సన్మానిస్తారు.

### దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు

సెప్టెంబర్ 17న మోడీ పుట్టినరోజు సందర్భంగా, దేశవ్యాప్తంగా "రక్తదాన శిబిరాలు" ఏర్పాటుచేసి, లక్షలాదిమంది బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరుగుతుంది. అదేవిధంగా అక్టోబర్ 2, మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా "స్వచ్ఛ అభియాన్" కార్యక్రమం ద్వారా ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు ఇతర రద్దీ ప్రాంతాలను శుభ్రపరచడం మొదలైన కార్యక్రమాలను బీజేపీ పార్టీ కార్యకర్తలే నిర్వహిస్తారు. అదేవిధంగా 'సేవాజ్యోతి' కార్యక్రమం ద్వారా అక్టోబర్ 7న మోడీ జన్మస్థలమైన వాద్‌నగర్ నుండి మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి వారణాసి వరకు "దేశహిత యాత్ర" ను చేపడతారు. దేశవ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయటం మరియు ఈ సంక్షేమ పథకాలలో చేరనటువంటి వారిని స్వచ్ఛందంగా ఈ పథకాలలో చేర్పించడం జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలలో పార్టీ కార్యకర్తల సొంత నిధులతో మరమ్మత్తులు చేపట్టి కనీస వసతులు కల్పించడం వంటి కార్యక్రమాలు కూడా "సేవా సమ్మాన్ అభియాన్"లో భాగంగా ఉన్నాయి.

### కోట్లాది మొక్కలు నాటే కార్యక్రమం

అదేవిధంగా 'పర్యావరణ పరిరక్షణ'లో భాగంగా దేశవ్యాప్తంగా కొన్ని కోట్ల చెట్లను సామూహికంగా నాటడం జరుగుతుంది. 'నమో సేవా' పేరుతో నరేంద్ర మోడీ జీవిత విశేషాలను మరియు గత 25 సంవత్సరాలుగా మోడీ పరిపాలనలో దేశవ్యాప్తంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఎగ్జిబిషన్‌ల ద్వారా నేటి సమాజంలోని ప్రజలకు.. ముఖ్యంగా యువతకు తెలియజేయడం జరుగుతుంది. అంతే కాదు, కుష్టు మరియు ట్యూబర్‌కొలోసిస్ (టీబీ) వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు "ఆయుష్మాన్ భారత్" పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవల గురించి తెలియజేస్తారు. "వికసిత్ భారత్ సంకల్ప "పేరుతో గత 12 సంవత్సరాలుగా దేశంలో జరిగిన భారీ అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా దేశ అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. దేశంలోని యువతకు ఆరోగ్యంపై శ్రద్ధ కలిగించే దానికి మరియు దృఢమైన దేహ దారుఢ్యానికి అవసరమైన యోగా మరియు మంచి ఆహారపు అలవాట్లను తెలియజేసే భారీ స్థాయిలో 'క్రీడా పోటీలను' నిర్వహించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. భారతీయ జనతా పార్టీ మరియు అనుబంధ సంఘాలైన యువమోర్చా, మహిళా మోర్చా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ మోర్చాల ద్వారా నిర్వహించే ఈ సేవా కార్యక్రమాల ద్వారా ఇతరులకు స్ఫూర్తి కలిగించేందుకు ఎప్పటికప్పుడు 'సేవాకి కహానీ' పేరుతో సామాజిక మాధ్యమాలలో పొందుపరచడం జరుగుతుంది. 25 సంవత్సరాల ప్రజా జీవితంలో ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా, ఒక్కరోజు కూడా అధికారికంగా సెలవు తీసుకోకుండా భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ బృహత్ ప్రయత్నానికి భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, పుట్టినరోజు సందర్భంగా వారికి భగవంతుని ఆశీస్సులు కలగాలని సెప్టెంబర్ 17వ తేదీ సాయంకాలం దేశవ్యాప్తంగా "ఆశీర్వాద దీపం" పేరుతో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా దీపోత్సవ కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు లక్షల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి.



**యల్లాల మంజుల**
రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు
బిజెపి మహిళా మోర్చా-ఆంధ్రప్రదేశ్

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com